



Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 102 | సోమవారం 15 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## అమెరికాకు చైనా షాక్

### - చర్చల వేళ రెండు దర్యాప్తులు మొదలు..

బీజింగ్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14

ఎప్పుడూ చైనాపై ఏదో ఒక దర్యాప్తు మొదలుపెట్టామని అమెరికా చెప్పడం సర్వసాధారణంగా చూస్తుంటాం. ఈ సారి సీను రివర్స్ అయింది. వాషింగ్టన్ రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంభిస్తోందంటూ.. బీజింగ్ రెండు దర్యాప్తులు మొదలుపెట్టింది. అది కూడా స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళ కావడం గమనార్హం. ఈ సమావేశంలో



జాతీయ భద్రత, టిక్‌టాక్ సోషల్ మీడియా యాజమాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి.

- మిగతా 2లో..

## అవినీతిని అంతం చేస్తా

### - నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి

ఖాట్మాండు – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14

నేపాల్ తాత్కాలిక ప్రధాన మంత్రిగా సుశీలా కర్కి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన ఆమె ఆదివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. భద్రతా దళాలు, ప్రభుత్వ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది మేలో నేపాల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. నిరసనకారుల డిమాండ్‌కు అనుగుణంగా అవినీతిని అంతం చేస్తానని హామీ



- మిగతా 2లో..



## కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌కు వంతపాడింది

- కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ప్రధాని మోదీ - జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టి పాకిస్థాన్‌కు మద్దతిచ్చిందన్న ప్రధాని - ఉగ్రవాదంపై పోరాటాన్ని కాంగ్రెస్ బలహీనపరిచిందని ఆరోపణ
- అసోంలో చొరబాటుదారులకు ఆ పార్టీయే రక్షణ కల్పించిందని విమర్శ - 1962 చైనా యుద్ధంలో అసోంను కాంగ్రెస్ వదిలేసిందని ధ్వజం
- అసోంలో గిరిజనుల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందని వెల్లడి

2లో



## హిందీని ఆ ఒక్క రంగానికే పరిమితం చేయొద్దు

- సైన్స్, టెక్నాలజీ, న్యాయ రంగాల్లోనూ హిందీ వాడాలన్న అమిత్ షా - ప్రాంతీయ భాషలకు హిందీ పోటీ కాదు, స్నేహితురాలు మాత్రమేనని స్పష్టం - తమ మాతృభాషలోనే లేఖలు రాయాలంటూ సీఎంలకు కేంద్ర హోంమంత్రి పిలుపు - అంతర్జాతీయ వేదికలపై హిందీకి మోదీ గౌరవం పెంచారని ప్రశంస - పిల్లలకు మాతృభాషలోనే బోధించాలని తల్లిదండ్రులకు సూచన

2లో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక...

- స్వయంగా రంగంలోకి దిగిన సీఎం రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నేతలకు ఆదేశం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచన
- అభ్యర్థి ఎంపికను ఏఐసీసీ చూసుకుంటుందని స్పష్టం చేసిన సీఎం
- బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నేతలకు దిశానిర్దేశం
- సమావేశంలో పాల్గొన్న మంత్రులు, పీసీసీ చీఫ్, ముఖ్య నేతలు



హైదరాబాద్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి, పార్టీ గెలుపు వ్యూహాలపై దృష్టి సారించారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం అనుసరించాల్సిన ప్రణాళికలపై ఆయన పార్టీ ముఖ్య నేతలతో నేడు కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల ఇన్‌ఛార్జులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకూ చేర్చాలని, బూత్ స్థాయి నుంచి పటిష్టంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. "నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందనే భరోసాను ప్రజలకు కల్పించాలి. అభ్యర్థి ఎవరనేది ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నిర్ణయిస్తుంది. కానీ, అభ్యర్థి ఎవరైనా పార్టీని గెలిపించే బాధ్యత మీ అందరిపై ఉంది"

- మిగతా 2లో..



## ఏపీలో నాలుగు రోజుల పాటు వర్షాలు

- అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వానలు - పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం - ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక - చెట్ల కింద నిలబడొద్దని ప్రజలకు కీలక సూచన - గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇప్పటికే భారీ వర్షపాతం నమోదు

అమరావతి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) కీలక సూచన చేసింది. రాష్ట్రంలో అల్పపీడనం, ద్రోణి ప్రభావం కారణంగా రాబోయే నాలుగు రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడనుండగా, ఒకటి రెండు చోట్ల

- మిగతా 2లో..

## రాష్ట్రానికి సహకారం



- బీజేపీ అధ్యక్షులు జేపీ నడ్డా
- విశాఖలో 'సారథ్యం యాత్ర' ముగింపు సభ


2లో

## ఆక్వా రుణ వడ్డీలపై మారటోరియం

- ఉత్పత్తుల రవాణాకు డెడికేటెడ్ రైళ్లు
- కేంద్ర మంత్రులకు సిఎం చంద్రబాబు లేఖ

అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14

అమెరికా సుంకాలతో ఇబ్బంది పడుతున్న ఆక్వా రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్, మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌కు ఆదివారం విడివిడిగా లేఖలు రాశారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర సహాయం కూడా ఆక్వా రైతులను ఆదుకునేందుకు అవసరమవుతుందని, ఈ సమస్యల పరిష్కారం కోసం ఎగుమతిదారులకు ఆక్వా కంపెనీల బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం, వడ్డీ చెల్లింపులపై 240 రోజులపాటు మారటోరియం విధించాలని సిఎం కోరారు. వడ్డీ రాయితీ కల్పించడంతోపాటు ఫ్రొజెన్ రొయ్యలపై ఉన్న 5 శాతం జీఎస్‌టిని తాత్కాలికంగా మినహాయించడం వంటి చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ చర్యలతో అమెరికా కాకుండా ఇతర దేశాలకు ఆక్వా మార్కెట్‌ను విస్తరించే




- మిగతా 2లో..



## మంత్రి నారా లోకేశ్ పుత్రోత్సాహం...

- లండన్‌లో 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పురస్కారం అందుకున్న దేవాన్ష్ - చదరంగంలో దూసుకుపోతున్న నారా దేవాన్ష్ - 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ రికార్డుకు అరుదైన గుర్తింపు
- కుమారుడి అవార్డు ప్రదానోత్సవానికి హాజరైన మంత్రి నారా లోకేశ్
- దేవాన్ష్ ఘనత చూసి గర్వపడుతున్నానని లోకేశ్ వెల్లడి - పదేళ్ల వయసులోనే ఇప్పటికే మూడు ప్రపంచ రికార్డులు నెలకొల్పిన చిన్నారి - వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో ఘనంగా జరిగిన పురస్కార ప్రదానోత్సవం

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# అమెరికాకు చైనా షాక్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా సెమీ కండక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసీ చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలుపెట్టింది.
వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారు చేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండక్టర్లపై వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తును చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ జరిగింది. అమెరికా ఎగుమతి నియంత్రణలు, టారిఫ్‌లు వంటి వాటిని ఈ సందర్భంగా చైనా బలంగా ప్రస్తావించే అవకాశం ఉంది. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎంఐసి కూడా ఉంది.

# అవినీతిని అంతం చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. సుపరిపాలన, ఆర్థిక సమానత్వం కోసం దృఢనిశ్చయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. రెండు రోజుల నిరసనల్లో 72 మంది మరణించారని, 191 మంది గాయపడ్డారని, మృతులను అమరవీరులుగా ప్రభుత్వం గుర్తించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏకనారాయణ్ ఆర్యల్ తెలిపారు. వీరి కుటుంబాలకు ఒక్కొక్కరికీ 10 లక్షల నేపాలీ రూపాయిల పరిహారం అందజేస్తామని, క్షతగాత్రులకు ఉచిత వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రధానమంత్రిగా సుశీలా కర్కి నియామకాన్ని అమెరికా స్వాగతిం చింది. అశాంతి నుంచి స్థిరత్వం వైపు అడుగుగా పేర్కొంటూ నేపాల్‌లోని అమెరికా రాయబారి డిన్ ఆర్ థాంప్సన్ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు.

## కాంగ్రెస్ పార్టీ
# పాకిస్థాన్‌కు వంతపాడింది

**- కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ప్రధాని మోదీ - జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టి పాకిస్థాన్‌కు మద్దతిచ్చిందన్న ప్రధాని - ఉగ్రవాదంపై పోరాటాన్ని కాంగ్రెస్ బలహీనపరిచిందని ఆరోపణ - అసోంలో చొరబాటుదారులకు ఆ పార్టీయే రక్షణ కల్పించిందని విమర్శ**
**- 1962 చైనా యుద్ధంలో అసోంను కాంగ్రెస్ వదిలేసిందని ధ్వజం**
**- అసోంలో గిరిజనుల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందని వెల్లడి**

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14**

కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ భద్రతను పణంగా పెట్టి, జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసి కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌కు కొమ్ముకాసిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం అసోంలోని దర్రాంగ్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్ విధానాలపై నిప్పులు చెరిగారు. ఉగ్రవాదంపై పోరాటాన్ని కాంగ్రెస్ బలహీనపరిచిందని మోదీ ఆరోపించారు. "కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదం పెట్రేగిపోయింది. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ, మన సైన్యం స్థైర్యాన్ని దెబ్బతీసేలా పాకిస్థాన్ వాదనలకు కాంగ్రెస్ వంత పాడింది. మన సైన్యానికి అండగా నిలవాల్సింది పోయి, పాక్ సైన్యానికి మద్దతుగా నిలిచింది" అని ప్రధాని ధ్వజమెత్తారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించేవారి గొంతును కాంగ్రెస్ బలోపేతం చేస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. అసోంలోని మరో ప్రాంతమైన గోలాఘాట్‌లో జరిగిన సభలో చొరబాట్ల అంశాన్ని మోదీ ప్రస్తావించారు. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు రక్షణ కల్పించిందని విమర్శించారు. దీనివల్ల అసోం జనాభా స్వరూపంలో పెను మార్పులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యతిరేక శక్తులను కాపాడటమే కాంగ్రెస్ విధానమని ఆయన ఆరోపించారు. 1962 చైనా యుద్ధం నాటి పరిస్థితులను కూడా మోదీ గుర్తుచేశారు. "అప్పటి ప్రధాని నెహ్రూ అనుసరించిన విధానాల వల్ల చైనా సైనికులు దూసుకువస్తున్నప్పుడు అసోంను, ఈశాన్య రాష్ట్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఆనాటి నిర్లక్ష్యం మిగిల్చిన గాయాలు అసోం ప్రజల మనసుల్లో ఇంకా పచ్చిగానే ఉన్నాయి" అని మోదీ అన్నారు. అయితే, తమ బీజేపీ ప్రభుత్వం అసోంను చొరబాటుదారుల నుంచి విముక్తం చేసేందుకు కట్టుబడి ఉందని ప్రధాని స్పష్టం చేశారు. స్థానిక గిరిజనుల హక్కులను కాపాడేందుకు వారికి భూమి పట్టాలు అందిస్తూ భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన వివరించారు.

## హిందీని ఆ ఒక్క రంగానికే
# పరిమితం చేయొద్దు

**- సైన్స్, టెక్నాలజీ, న్యాయ రంగాల్లోనూ హిందీ వాడాలన్న అమిత్ షా - ప్రాంతీయ భాషలకు హిందీ పోటీ కాదు, స్నేహితురాలు మాత్రమేనని స్పష్టం - తమ మాతృభాషలోనే లేఖలు రాయాలంటూ సీఎంలకు కేంద్ర హోంమంత్రి పిలుపు - అంతర్జాతీయ వేదికలపై హిందీకి మోదీ గౌరవం పెంచారని ప్రశంస - పిల్లలకు మాతృభాషలోనే బోధించాలని తల్లిదండ్రులకు సూచన**

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** హిందీని కేవలం సంభాషణలకు, అధికారిక కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేయకూడదని, సైన్స్, టెక్నాలజీ, న్యాయం, పోలీసు యంత్రాంగం వంటి కీలక రంగాలకు కూడా దానిని మూలస్తంభంగా మార్చాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. హిందీ ఇతర భారతీయ భాషలకు పోటీ కాదని, వాటన్నిటికీ ఒక నేస్తం మాత్రమేనని ఆయన పునరుద్ఘాటించారు. హిందీ దివస్ సందర్భంగా ఆదివారం జరిగిన ఐదవ అఖిల భారత అధికార భాషా సమ్మేళనంలో అమిత్ షా ప్రసంగించారు. "అన్ని పనులు భారతీయ భాషల్లో జరిగినప్పుడు, ప్రజలతో మన బంధం దానంతట అదే బలపడుతుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఒక ప్రత్యేక పిలుపునిచ్చారు. తమ మాతృభాషలోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖలు రాయాలని, ఆ లేఖలకు తాను కూడా వారి భాషలోనే సమాధానం ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో భారతీయ భాషలకు, సంస్కృతికి పునరుజ్జీవనం లభించిందని షా ప్రశంసించారు. ఐక్యరాజ్యసమితి, జీ-20 వంటి అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ హిందీలో మాట్లాడి భారతీయ భాషల గౌరవాన్ని ఇనుమడింపజేశారని గుర్తుచేశారు. బానిసత్వపు చిహ్నాల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ప్రధాని మోదీ తీసుకున్న 'పంచ ప్రాణ్' (ఐదు ప్రతిజ్ఞలు)లో భాషలకు కూడా కీలక పాత్ర ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ చెప్పిన మాటలను ఆయన ఉటంకించారు. 'స్వరాజ్, స్వధర్మం, స్వభాష' అనే మూడు అంశాలు దేశ ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్నాయని అన్నారు. పిల్లలకు వారి మాతృభాషలోనే విజ్ఞానాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. వేరే భాషలో నేర్చుకోవడం వల్ల పిల్లల అభ్యాస సామర్థ్యం 30 శాతం వరకు తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు. 'భారతీయ భాషా అనుభాగ్' ఏర్పాటుతో అధికార భాషా విభాగం ఇప్పుడు పూర్తిస్థాయి శాఖగా మారిందని ఆయన తెలిపారు.

## తిరుపతిలో అత్యాధునిక
# బస్ స్టేషన్ నిర్మించాలి

**- తిరుపతిలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి సన్నాహాలు**
**- రోజుకు లక్ష మంది ప్రయాణికుల సామర్థ్యంతో నిర్మాణం**
**- హెలిప్యాడ్, మాల్స్, మల్టీప్లెక్స్‌లతో కూడిన డిజైన్లు**
**- భవిష్యత్ అవసరాల కోసం ప్రతి బస్సుకు ఈవీ చార్జింగ్ సౌకర్యం**
**- బస్ స్టేషన్ నమూనాలను పరిశీలించి అధికారులకు సీఎం సూచనలు**
**- రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లను ఆధునీకరించాలని ఆదేశం**



**అమరావతి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14**

రోజురోజుకు పెరుగుతున్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించాలని, అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం నాడు క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు... నూతనంగా నిర్మించే బస్ స్టేషన్‌లో సుమారు 150 బస్సులు ఒకేసారి నిలిపి ఉంచేలా బస్ బే ఉండాలని, హెలిపాడ్ సౌకర్యంతో పాటు, రోప్ వే, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మాల్స్, మల్టీ ప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. రెండు బస్ ఎంట్రీలు, ఎగ్జిట్ వేలు 2 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్ టాప్‌తో సొంత విద్యుత్ అవసరాలు తీర్చుకునేలా చూడాలన్నారు. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన ఈ బస్ స్టేషన్ కనీసం లక్ష మంది నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణం చేయాలన్నారు.

భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతీ బస్సుకు చార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించి మొత్తం 5 మోడల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. దీనికోసం స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని బస్ స్టేషన్లు ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచనలు చేశారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక...

(మొదటి పేజీ తరువాయి)

అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కూడా ఆయన సూచించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా సమీక్ష నిర్వహించడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

## ఆక్వా రుణ వడ్డీలపై
# మారటోరియం

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. యూరోపియన్ యూనియన్, దక్షిణ కొరియా, సౌదీ, రష్యా దేశాల్లో ఆక్వా ఎగుమతులు పెరిగేలా ఆయా దేశాలతో ఫ్రీటెడ్ ఒప్పందాలు కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలని ప్రస్తావించారు. ఎగుమతిదారులకు మధ్యంతర ఆర్థికసాయం, ఎగుమతులపై విధించే సుంకాలు, పన్నుల ఉపశమనం పథకంపై మరింత స్పష్టతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్ దేశాలకు సీ ఫుడ్ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎగుమతిదారులు తనకు విజ్ఞప్తి చేశారని సిఎం పేర్కొన్నారు. దేశీయంగా ఆక్వా మార్కెటింగ్ పెంచుకోవడానికి అవసమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ కేటాయించాలని కోరారు. కోల్డ్ స్టోరేజీలు, హైజినిక్ ఫిష్, సీ ఫుడ్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని, రైతుల నుంచి నేరుగా ఆక్వా ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేలా ఎపి రొయ్యల ఉత్పత్తిదారుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సిఎం లేఖలో పేర్కొన్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో మంచి ప్రొటీన్ ఉంటుందని, ఇది మంచి బలవర్ధకమైన ఆహారమనే విషయాన్ని అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఎన్ఎఫ్‌డిబి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో అవగాహన కుదుర్చుకోవాలని సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా మత్స్యకారులకు రూ.1 లక్ష వరకు వన్‌టైమ్ టాప్ అప్ రుణాలివ్వాలని కోరారు. ఐకార్-సిఐబిఎ, ఐకార్-ఎన్‌బిఎఫ్‌జిఆర్ వంటి సంస్థల ప్రాంతీయ కార్యాలయాలను రాష్ట్రంలో ఏర్పాటుచేయాలన్నారు. జాతీయ స్థాయిలో జరిగే రొయ్యల ఎరువుల్లో రాష్ట్రం నుంచి 80 శాతం వాటా ఉందని, సముద్రం ఉత్పత్తుల ఎగుమతుల్లో 34 శాతం వాటా రాష్ట్రం కలిగి ఉందని పేర్కొన్నారు.

# రాష్ట్రానికి సహకారం

**- బీజేపీ అధ్యక్షులు జేపీ నడ్డా**
**- విశాఖలో 'సారథ్యం యాత్ర' ముగింపు సభ**

**విశాఖపట్నం- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14**

దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. విశాఖలోని రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన బిజెపి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సారథ్యం యాత్ర ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యాన అభివృద్ధి పట్టాలు ఎక్కిందన్నారు. 2014లో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను ఇప్పుడు మూడో స్థానానికి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,400 కోట్ల ప్యాకేజీని అందించామన్నారు. సౌత్‌కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రకటించడంతోపాటు జిఎంను నియమిం చామన్నారు. విశాఖ పట్నం, కడప, తిరుపతిల్లో విమానా శ్రయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తొమ్మిది వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం సాగుతోందని, సాగరమాల కింద 15 పోర్టులు నిర్మిస్తున్నామని, అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారిందని అన్నారు. విశాఖకు సమీపంలో రూ.625 కోట్లతో భోగాపురం విమానాశ్రయం నిర్మాణం జరుగుతోందని, పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు వస్తోందని తెలిపారు

# ఏపీలో నాలుగు రోజుల పాటు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలు కూడా నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో నిలబడటం సురక్షితం కాదని హెచ్చరించారు.

సోమవారం నాడు అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడవచ్చని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైనట్లు ఆయన తెలిపారు. అత్యధికంగా గుంటూరులో 81 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, పల్నాడు జిల్లా తుర్లపాడులో 54.5 మి.మీ, పెద్దకూరపాడులో 40.2 మి.మీ, గుంటూరు జిల్లా వంగిపురంలో 39.5 మి.మీ, కోనసీమ జిల్లా ముక్కామలలో 39 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు గణాంకాలను వెల్లడించారు.

## మంత్రి నారా లోకేశ్
# పుత్రోత్సాహం...

**అమరావతి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14**

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ (10) అంతర్జాతీయ వేదికపై అరుదైన ఘనత సాధించాడు. చదరంగంలో అద్భుత ప్రతిభ కనబరిచి నెలకొల్పిన ప్రపంచ రికార్డుకు గాను, లండన్‌లోని చారిత్రాత్మక వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి మంత్రి నారా లోకేశ్ స్వయంగా హాజరై, కుమారుడి విజయాన్ని చూసి మురిసిపోయారు. వివరాల్లోకి వెళితే, గత ఏడాది జరిగిన 'చెక్ మేట్ మారథాన్' పోటీలో దేవాన్ష్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. ప్రఖ్యాత చెస్ గ్రాండ్‌మాస్టర్ లాస్లో పోల్గార్ రచించిన "5334 ప్రాబ్లమ్స్, కాంబినేషన్స్, అండ్ గేమ్స్" పుస్తకం నుంచి తీసుకున్న 175 క్లిష్టమైన చెక్‌మేట్ పజిల్స్‌ను అత్యంత వేగంగా పరిష్కరించి 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ రికార్డు సృష్టించాడు. సులభం నుంచి అత్యంత కఠినంగా మారే ఈ పజిల్స్‌ను పరిమిత సమయంలో పరిష్కరించడం ద్వారా దేవాన్ష్ తన వేగాన్ని, మేధాశక్తిని ప్రపంచానికి చాటాడు. ఈ అద్భుతమైన రికార్డును గుర్తించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ, తాజాగా దేవాన్ష్‌ను పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం నిజంగా చాలా ప్రత్యేకమైన సందర్భం. పదేళ్ల వయసులోనే ముందుచూపుతో ఆలోచించడం, ఒత్తిడిలో ప్రశాంతంగా ఉండటం, ఆట పట్ల పూర్తి అంకితభావంతో ఉండటం అతని విజయాన్ని మరింత ప్రత్యేకం చేశాయి. ఒక తండ్రిగా, అతను గంటల తరబడి చేసిన సాధనను నేను కళ్లారా చూశాను. అతని కష్టానికి దక్కిన నిజమైన ప్రతిఫలం ఈ గుర్తింపు. మేమందరం అతని గురించి చాలా గర్వపడుతున్నాం" అని తెలిపారు. తల్లిదండ్రులు నారా బ్రాహ్మణి, నారా లోకేశ్ ల ప్రోత్సాహం, కోచ్ కె. రాజశేఖర్ రెడ్డి మార్గదర్శకత్వంలో దేవాన్ష్ నెలల తరబడి ఏకాగ్రతతో సాధన చేసి ఈ ఘనతను సాధించాడు. ఈ రికార్డుతో పాటు, గతంలో మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా దేవాన్ష్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఏడు డిస్క్‌ల 'టవర్ ఆఫ్ హనోయి' పజిల్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, అలాగే 9 చెస్ బోర్డులను 32 పావులతో కేవలం 5 నిమిషాల్లో సరిగ్గా అమర్చడం ద్వారా కూడా రికార్డులు నెలకొల్పాడు. దేవాన్ష్ విజయం అతని కుటుంబానికే కాకుండా, ప్రపంచ చెస్ రంగంలో ఎదుగుతున్న భారత కీర్తికి నిదర్శనంగా నిలిచింది.

# సంపాదకీయం

## లోకేష్ 2.0

### - అన్ని పనుల్లో స్పష్టమైన మార్పు



ఏపీ మంత్రి నారా లోకేష్ లోస్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఆయన పనితీరులో సమూల మార్పులు రావడం విశేషం. రాష్ట్ర మంత్రిగా ఉంటూ బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తేగలుగు తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసు కుంటున్నారు. కేంద్ర పెద్దలతో తరచూ మాట్లాడు తున్నారు. అదే సమయంలో రాజకీయంగా సొంత పార్టీని ఒంటి చేత్తో నడపగలుగుతున్నారు. చంద్రబాబు పూర్తిగా పాలనపై దృష్టి పెట్టేలా.. మిగతా వ్యవహారాలను అన్నీ తానై చూస్తున్నారు నారా లోకేష్. మరోసారి డేరింగ్ స్టెప్ వేశారు నారా లోకేష్. కూటమి ప్రతిష్టాత్మకంగా అనంతపురంలో నిర్వహిస్తున్న 'సూపర్ సిక్స్ సూపర్ హిట్ ' కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. నేపాల్ పరిణామాల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న ఏపీ ప్రజలను రప్పించే బాధ్యతను తీసుకున్నారు. అందుకే ఈ సభకు వెళ్లకుండా సచివాలయం నుంచి నేపాల్ నుంచి సురక్షితంగా తెచ్చే ప్రయత్నాలు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ నేపాల్ లో చిక్కుకున్న ఏపీ ప్రజలను రక్షించనున్నారు నారా లోకేష్.కూటమిఅధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. సంక్షేమ పథకాలతో సైతం అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించింది ఏపీ ప్రభుత్వం. నిధులు సమీకరించగలిగింది. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు సైతం చురుగ్గా సాగుతున్నాయి. ఇంకోవైపు రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పన కూడా జరిగింది. సంక్షేమ పథకాలు పట్టాలెక్కాయి. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్న క్యాంటీన్లు.. ఇలా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయగలిగింది కూటమి ప్రభుత్వం. 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకం సైతం పూర్తి చేయగలిగింది. అందుకే 15 నెలల కూటమిపాలన సక్సెస్ కావడంతో అనంతపురం వేదికగా భారీ కార్యక్రమానికి ఈరోజు సంకల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. అయితే ప్రభుత్వంతో పాటు తెలుగుదేశం పార్టీలో అత్యంత కీలకమైన నారా లోకేష్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం మాత్రం చిన్న విషయం కాదు. అయితే నేపాల్ పరిణామాల నేపథ్యంలో ఏపీ ప్రజల కష్టాలను గట్టెక్కించేందుకు లోకేష్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉండి పోవాల్సి వచ్చింది.నేపాల్ పరిణామాల నేపథ్యంలో నారా లోకేష్ తన అనంతపురం పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈరోజు ఉదయం 10 గంటలకు సచివాలయంలోని రియల్ టైం గవర్నెన్స్ సెంటర్ కు నారా లోకేష్ వెళ్లారు. రియల్ టైం గవర్నెన్స్ వేదికగా ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే ఆర్టిజిఎస్ సెంటర్ కు రావాలని ఆదేశాలు జారీ చేశారు నారా లోకేష్. అక్కడ ప్రత్యేక కాల్ సెంటర్, వాట్సాప్ నెంబర్ ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించనున్నారు. నేపాల్ లో చిక్కుకున్న వారి వివరాలు సేకరించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో తక్షణమే వారిని రాష్ట్రానికి తీసుకురానున్నారు. అత్యంత కీలకమైన ఈ బాధ్యతను వేరే నేతలకు, మంత్రులకు అప్పగించకుండా లోకేష్ స్వయంగా పర్యవేక్షిస్తుండడం విశేషం.వాస్తవానికి విదేశాల్లో చిక్కుకునే వారిని స్వస్థలాలకు తెప్పించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. మంత్రివర్గ ఏర్పాటు సమయంలోనే ఆ బాధ్యతలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు అప్పగించింది. అయితే ఎక్కువగా విదేశాల్లో చిక్కుకున్న వారి విషయంలో మంత్రి నారా లోకేష్ చొరవ చూపుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. విదేశాల్లో ఉండే బాధితులు ఎక్కువగా లోకేష్ ను ఆశ్రయించడం ప్రారంభించారు. లోకేష్ ను ఆశ్రయిస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందని బాధితుల అభిప్రాయం. అందుకే మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి లోకేష్ గ్రీవెన్స్ సెల్ పెడితే.. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు వచ్చి అక్కడ వినతులు అందిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కేంద్రం వద్ద కూడా లోకేష్ పరపతి పెరిగింది. ప్రపంచ దిగ్గజ సంస్థల ప్రతినిధులతో సైతం నారా లోకేష్ కు సాన్నిహిత్యం ఉంది. అందుకే ఏపీకి పెట్టుబడుల వరద వస్తోంది. ఇంకోవైపు విదేశాల్లో ఉండే తెలుగు ప్రజలకు సంబంధించిన సంఘాల ప్రతినిధులు సైతం లోకేష్ తో టచ్ లో ఉంటారు. అందుకే విదేశాల్లో ఎవరికైనా ఇబ్బందులు వస్తే ముందుగా గుర్తొచ్చే పేరు నారా లోకేష్. అయితే ఇప్పుడు నేపాల్ లో అల్లకల్లోలం ఉన్న నేపథ్యంలో.. అక్కడ చిక్కుకున్న ఏపీ ప్రజలను రప్పించే గురుతర బాధ్యతను తీసుకున్నారు నారా లోకేష్. ఓ రాజకీయ భారీ బహిరంగ సభ ప్లాన్ చేసిన తర్వాత ప్రభుత్వంతో పాటు తెలుగుదేశం పార్టీలోనూ, కూటమిలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్న లోకేష్ దూరంగా ఉండడం.. అది కూడా ప్రజల కోసమే కావడం నిజంగా అభినందించదగ్గ విషయం.

# ఇండియా, అమెరికా చర్చలకు వేళాయెరా..

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

డొనాల్డ్ ట్రంప్ టారీఫ్‌ల బాదుడుతో భారత్, అమెరికాల మధ్య జరగాల్సిన ఆరో దశ వాణిజ్య చర్చలు అర్థాంతరంగా వాయిదా పడ్డాయి. అయితే, ఈ చర్చలు త్వరలో న్యూఢిల్లీలో ప్రారంభం కానున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ చర్చలు, ఒప్పందం ఖరారు దిశగా సాగుతాయని పేర్కొన్నాయి వ్యవసాయం, పాడి పరిశ్రమ విషయంలో భారత్ తన వైఖరికి కట్టుబడి ఉండాలని భావిస్తోంది, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవల ప్రధాని స్పష్టం చేశారు..సుంకాల మేఘాలు కమ్ముకున్న వేళ... భారత్, అమెరికాల మధ్య ఆరో దశ వాణిజ్య చర్చలు త్వరలోనే ప్రారంభమవుతాయని, ఒప్పందం ఖరారు కానుందని విశ్వసనీయ వర్గాలు బుధవారం వెల్లడించాయి. వాస్తవానికి ఆగస్టు చివరి వారంలోనే ఈ చర్చలు జరగాల్సి ఉండగా.. భారత్‌పై ట్రంప్ 50 శాతం అదనపు సుంకాలు విధించడంతో వాయిదా పడ్డాయి. ఈ చర్చలు న్యూఢిల్లీలోనే జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం భారత్‌తో వాణిజ్య చర్చలు పున:ప్రారంభమవుతాయని ట్రూత్ సోషల్‌లో హింట్ ఇచ్చారు. వాణిజ్య అడ్డంకులను అధిగమించడానికి ఇరు దేశాలూ చర్చలు కొనసాగిస్తున్నాయని ఆయన తెలిపారు.“రాబోయే వారాల్లో నా ఆప్త మిత్రుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడటానికి నేను ఎదురు చూస్తున్నాను. మన రెండు గొప్ప దేశాలకు విజయవంతమైన ముగింపుకు రావడంలో ఎటువంటి



ఇబ్బంది ఉండదు ” అని ట్రంప్ పోస్ట్ పెట్టారు. వైట్‌హౌస్ వద్ద ట్రంప్ మాట్లాడుతూ.. భారత్–అమెరికా మైత్రిని చాలా ప్రత్యేకమైన సంబంధంగా పేర్కొంటూ.. మోదీ, తాను స్నేహితులుగా ఉంటామని నొక్కి చెప్పారు. ఈ ప్రకటన చేసిన కాసేపటికే ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పై విధంగా స్పదించారు. 'బాధపడాల్సిన పని లేదు. మనకు సందర్భానుసారంగా క్షణాలు మాత్రమే ఉంటాయి' అని అన్నారు.ట్రంప్ పోస్ట్‌పై కూడా ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్ సానుకూల ఆలోచనలను తాను అభినందిస్తున్నానని, పరస్పరం స్పందిస్తున్నానని మోదీ అన్నారు. ధరలకు ప్రాధాన్యత ఇచ్చే వ్యవసాయం, డెయిరీ మార్కెట్లలోకి అమెరికా ప్రవేశాన్ని భారత్ నిరాకరించడంపై దీర్ఘకాలిక ప్రతిష్టంభన కొనసాగుతోంది. అయినప్పటికీ ట్రంప్ పదే పదే డిమాండ్ చేస్తున్నది ఏమిటంటే అక్టోబర్ గడువు నాటికి ఒక ఒప్పందం లేదా కనీసం ముందస్తు ఫ్రేమ్‌వర్క్ ఇరుపక్షాలు ఆశిస్తున్నాయని వర్గాలు తెలిపాయి. అయితే, భారత్ వ్యవసాయం, పాడి పరిశ్రమపై తన వైఖరికి కట్టుబడి ఉండాలని కోరుకుంటుంది. చౌకైన అమెరికన్ వస్తువులు ఈ మార్కెట్లను నీరుగార్చడానికి, కోట్లాది మంది రైతులు, పశు పెంపకందారులు, మత్స్యకారులు, మహిళల జీవనోపాధిని దెబ్బతీస్తాయని భారత్ భావిస్తోంది. దీంతో పాటు మొక్కజొన్న, సోయాబీన్, యాపిల్, బాదం, ఇథనాల్ వంటి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలనే ప్రతిపాదనలను కూడా భారతదేశం తోసిపుచ్చింది. దీనిని అనుమతించడం వల్ల భారత రైతులపై ప్రభావం పడుతుందని కేంద్రం వాదిస్తోంది. ఢిల్లీలోని ఎర్రకోట నుంచి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'రైతులు, మత్స్యకారులు, పశువుల పెంపకం దారులకు సంబంధించిన ఏదైనా హానికరమైన విధానానికి వ్యతిరేకంగా మోదీ గోడలా నిలబడుతున్నారు... భారత్ ఈ విషయంలో ఎప్పటికీ రాజీపడబోదని' మోదీ ఖరాఖండీగా చెప్పారు.

# వర్మ మౌనం వెనుక వ్యూహం

**కాకినాడ – సూర్య వాస్తవం**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం లో ఏ అధికారిక కార్యక్రమాల్లోనూ ఒక్క వర్మ తప్ప తెలుగుదేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎందుకు కనిపించడం లేదు. దీనికి బదులు దొరకని ప్రశ్నగా పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి కనిపిస్తోంది. మన అనే భావన ఉంటే ఎంతదూర మైనా వెళ్తాం.. తీరా అక్కడకు వెళ్లాక ఎవ్వరూ పట్టించుకోకపోతే.. కనీసం పలుకరింపునకు కూడా నోచుకోకపోతే.. అక్కడ ఇమడలేని పరిస్థితి ఎదుర వుతుంది.. ఆరోజు ఏదోలా సమయం గడిపి రేపన్నాక వెళ్లేందుకు కూడా ఇష్ట పడం.. సరిగ్గా ఇలానే ఉందట పిఠాపురం నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్ల పరిస్థితి. పిలవని పేరంటానికి మనదే కదా అని వెళితే కనీస గుర్తింపు లేని చోట ఇమడలేక.. అటు బయట చెప్పుకోలేక సతమతమవుతున్నారట పిఠాపురంలోని తెలుగు తమ్ముళ్లు. నియోజకవర్గ నాయకునితో చెప్పుకుందామంటే కొన్ని సందర్భాల్లో ఆయనకే ఏమీ తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నారని, ఇక ఆయన మాకే న్యాయం చేస్తాడని లోలోన మధన పడిపోతున్నారట..

పై అధిష్టానికి చెప్పుకుందామంటూ ఇదంతా కావాలనే వర్మ చేస్తున్నారా అన్న ప్రచారంతో ముందుకు అడుగు పడక తెగ ఫీల్ అయిపోతున్నారట. కేడర్ పరిస్థితి ఇలా ఉంటే ఇక టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వర్మ పరిస్థితి మరో విధంగా ఉంది. ప్రాధాన్యత లేకుండా పోయిన తెలుగు తమ్ముళ్లను సంతృప్తి పరచలేక.. మరోపక్క అధిష్టానాన్ని ప్రశ్నించలేక సంకట పరిస్థితిని ఎదుర్కొంటున్నారట. మొత్తంమీద పిఠాపురం కూటమిలో మాత్రం నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితి ఎప్పుడు లావా మాదిరి ఉప్పొంగుతుందా అనేలా పరిస్థితి ఉందని అర్థం అవుతుంది..పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో తెలుగుదేశం పార్టీకి సంకట పరిస్థితి ఎదుర్కొంటుందా అన్న ప్రశ్నకు టీడీపీ కార్యకర్తలు ఔననే సమాధానం చెబుతున్నారు. ఇక్కడ జరుగుతున్ నఏ అధికారిక కార్యక్రమాలకు తెలుగు



తమ్ముళ్లకు ఏ కబురు ఉండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురంలో ఆది నుంచి టిడిపి వర్సెస్ జనసేనగానే పరిస్థితి ఉంది. తొలినాళ్లలో వర్మకు సీటు విషయంలో అలజడి రేగిన తర్వాత చంద్రబాబు హామీతో ఆయన వెనక్కి తగ్గి పవన్‌కు మద్దతు నిలిచారు.

అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలలో పవన్ వెంటే నడుస్తోన్న వర్మ పలు సందర్భాల్లో చేదు అనుభవాల్ని ఎదుర్కొన్న పరిస్థితి కనిపించింది. అయితే తన అసహనాన్ని ఏ మాత్రం బయటపడకుండా జాగ్రత్త పడ్డ వర్మ తన వెంట ఉండే పార్టీ నాయకులకు దక్కని గౌరవంపై మాత్రం చాలా అసంతృప్తిలో ఉన్నారన్నది ఆయన అనుచరుల మాట. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో మాత్రం ముందునుంచీ ఉన్నట్లే టిడిపి–జనసేన మధ్య ఎడమోహం పెడమోహంగానే ఉంది పరిస్థితి. మూడు పార్టీలు కలిసి చేసిన కార్యక్రమాల్లో కనీసం పట్టుమని పది మంది టీడీపీ నాయకులు లేని విధంగా పరిస్థితి మారింది. పదవుల పంపకాల్లో అధిష్టానమే అన్ని లెక్కలు చూస్తోందని సర్దుకు పోతున్నా.. ఆఖరికి ఎవరికి ఏ పదవి వచ్చినా సర్దుకుపోతున్నారట. ఎందుకంటే పాలన పెత్తనంలో తమకు ఎటువంటి అవకాశం ఇవ్వడం లేదన్న నిస్తేజంలో అసలు మాకు పదవుందా.. అని ప్రశ్నిస్తూ టిడిపి నేతలు బాహాటంగా విమర్శిస్తున్నారు. దీనిపై వర్మ ఎన్నిసార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో తెలుగు తమ్ముళ్లకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.పిఠాపురం పేరు చెబితే ప్రస్తుతం పవన్ మాటే వినిపిస్తోంది. దీంతో టిడిపిని నమ్ముకున్న వారికి కేవలం టిడిపి ప్రచార కార్యక్రమాలు తప్పితే పథకాలు, వాటి అమలకు సంబంధించి అధికారికంగా కబుర్లు రావడం లేదని టిడిపి నేతలే చెబుతున్నారు. తమ అధినాయకుడు నిత్యం టెలికాన్ఫరెన్స్ లలో కబుర్లు తప్పితే తమకు ఎటువంటి అవకాశాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పురుషోత్తపట్నం వాటర్ పంపింగ్ ప్రారంభానికి పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జి వర్మకు ఎటువంటి కబురు రాలేదు. పిఠాపురం జైగణేష్ ఆలయ ఉత్సవాలకు సంబంధించి ఛైర్మన్ అభ్యర్థిగా ఉన్న టిడిపి సీనియర్ నేత కొరుప్రోలు శ్రీనుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జనసేన నేతలే సమీక్ష నిర్వహించేశారు. దీనిపై కొరుప్రోలు శ్రీను సోషల్ మీడియాలో బాహాటంగానే ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అవమానంపై ఓ వీడియోను విడుదల చేశారు.

పాదగయలో జరిగిన సామూహిక వరలక్ష్మి వ్రతాలకు సంబంధించి ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు, జనసేన నాయకులే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కానీ టిడిపి నేతలకు పిలుపు రాకపోవడంతో దీనిపైనా వారు గుర్రుగా ఉన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే జనసేన అధికారికంగా జరిపే కార్యక్రమాలకు టిడిపికి ఎటువంటి సమాచారం ఉండకపోవడంతో టిడిపిని పూర్తిగా విస్మరించారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న వర్మ మౌనం వెనుక కారణం ఏంటి అన్న చర్చ స్థానికంగా కొనసాగుతోంది.. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చినా కంగారు పడకండి అన్న సమాధానమే వినిపిస్తోందట.. అయితే అధిష్టానం కూడా వర్మ మాటను పట్టించుకోవడం మానేసిందా.. సమస్య నేరుగా డిప్యూటీ సీఎం పవన్‌ది కావడంతో టిడిపి అధిష్టానం లైట్ తీసుకుంటుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది అర్థమైన వర్మ జనసేనతో సర్దుకుపోయేందుకు ట్రై చేస్తున్నారన్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం ప్రభుత్వ కార్యక్రమాలకు వర్మను పిలిచే విషయంలో కాస్త ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

# మహిళా భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి

**- దేశ సామాజిక ఉద్యమాల్లో వారి పాత్ర కీలకం**
**- మహిళా సాధికారిత జాతీయ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా**

**తిరుపతి – సూర్య వాస్తవం**

మహిళల భాగస్వామ్యం లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందలేదని, దేశ సామాజిక ఉద్యమాల్లో మహిళలు కీలక పాత్ర పోషించారని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అన్నారు. మహిళలకు గౌరవం ఇవ్వడం ఆదినుంచీ భారత సంప్రదాయంగా కొనసాగుతోందని వివరించారు. స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు కీలకపాత్ర పోషించారన్నారు. సామాజిక బంధనాలు ఛేధించుకుని మహిళలు అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. వారికోసం రాజ్యాంగం అనేక నిబంధనలు రూపొందించి ప్రపంచంలోనే భారతదేశం మహిళాశక్తిగా ఎదిగిందన్నారు. రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల మహిళా సాధికారత కమిటీల మొదటి జాతీయ సదస్సుకు తిరుపతి వేదికైంది. రెండు రోజుల పాటు రాహుల్ కన్వెన్షన్ హాల్లో జరగనున్న ఈ సదస్సు తొలిరోజు ఆదివారం జాతీయగీతం, రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభమైంది. పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ అధ్యక్షులు డి.పురంధేశ్వరి, రాజ్యసభ ఉపాధ్యక్షులు హరివంశ్, ఎపి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర మహిళా సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి, శాసన



వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవరలతో కలిసి ఓంబిర్లా%ొా% జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశం వికసిత్ భారత్‌గా మారాలంటే మహిళా సాధికారత, బాలల సంక్షేమమే పునాది కావాలన్నారు. 'మన కుమార్తెలు చదువుకొని స్వయం ఆధారితులైతేనే భారతదేశం సమగ్రాభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది' అని పేర్కొన్నారు. రెండు రోజుల సదస్సు మహిళా ఆధ్వర్యంలోని అభివృద్ధి అనే ప్రధాన అంశంపైనే జరుగుతుందని తెలిపారు. లింగానుసార అనుకూల బడ్జెట్, కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు మహి ళలకు సాధికారత అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయని వివరించారు. రాజ్యసభ ఉపాధ్యక్షులు హరివంశ్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మహిళల హక్కులకు బలమైన పునాదులు వేసిందని, బీహార్ రాష్ట్రం 50 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేసిందని, దేశంలో 41.50 లక్షల మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నారని వివరించారు. చట్టాలు మారడంతో సరిపోదని, సామాజిక అవగాహన పెరగాలి అని తెలిపారు. భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ పురంధేశ్వరి మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించ డంలో సమానత్వం, సమ్మిళితత్వం, సాధికారత ప్రాముఖ్యతను వివరించారు.

## పశువుల గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక టీకా శిబిరం




**పెళ్లకూరు– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** గాలికుంటు వ్యాధి నియంత్రణకు టీకాలు వేయడం ఒక్కటే సమర్థవంతమైన మార్గమని పశుసంవర్ధకశాఖ ఏడీ ధనంజయులు తెలిపారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 15వ తేదీ నుంచి అక్టోబర్ 15 వరకు నెలరోజులపాటు ప్రత్యేక టీకా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి మూడు నెలల పైబడిన అన్ని రకాల పశువులకు గాలికుంటు టీకాలు వేయనున్నారు. రైతులు తమ పశువులను సమయానికి టీకా వేయించుకోవాలని, ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని ఏడీ ధనంజయులు సూచించారు.

## 27 మంది కంటి రోగులకు ఆపరేషన్లు



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 27 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు నియోజకవర్గంలోని కెవిపల్లె, ఎర్రవారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, ఎన్.పీ.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 27 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, అప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కారు ఢీకొని బోయకొండ భక్తులకు తీవ్ర గాయాలు





**మదనపల్లె – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** కారు ఢీకొని బోయకొండ గంగమ్మ దర్శనానికి వచ్చి వెళుతున్న భక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆదివారం కురబలకోట మండలంలో జరిగిన ఘటనపై బాధితుల కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం, చింతామణి తాలూకా చేలూరు సమీపంలోని బై రామ్ పల్లెకు చెందిన మామ బావమరిది మనీశ్ (25), శశి (17) బైకులో ఆదివారం బంధువులు, చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లి మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన ఓ వేడుక కార్యక్రమానికి హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనాలు చేసుకుని ఇద్దరు బైక్ లో తిరుగు ప్రయాణమై స్వగ్రామానికి వెళుతుండగా, మార్గమధ్యంలోని కురబలకోట మండలం, కంటే వారిపల్లె వద్ద కారు వేగంగా వచ్చి మామ బావమరుదులు ప్రయాణిస్తున్న బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శశి, మనీష్ తీవ్రంగా గాయపడగా వారిని కురబలకోట 108 మస్తాన్, బావాజాన్ లు చికిత్స నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి వారిలో శశి పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు వెళ్లాలని రెఫర్ చేశారు. కుటుంబీకులు వారిద్దరిని వెంటనే బెంగుళూరు కు తరలించారు. ఘటనపై ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**- కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే**



**పామిడి –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14 :** పామిడి పట్టణంలోని స్థానిక భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు , శంకర కంటి ఆసుపత్రి ( బెంగుళూరు ) కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంజయ్, జిల్లా చైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కమిత్కర్ రఘువీర్, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, జిల్లా చైర్ పర్సన్ జయరాం రావు మాట్లాడుతూ కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతి అని అన్నారు. ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంజయ్ కంటి వైద్య శిబిరానికి వచ్చిన 120 మందిని పరీక్షించి అందులో 45 మందిని కంటి ఆపరేషన్ కు రెఫర్ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు మానవ హక్కుల కమిషన్, పర్యావరణ పరిరక్షణ దక్షిణ భారత సెక్రటరీ ఆవుల ప్రసాద్, లయన్స్ క్లబ్ కోశాధికారి డి. షేక్షావలి, క్లబ్ నిర్వాహకుడు ఆర్.ఎం.పి వైద్యులు గంగ శేఖర్, మార్కెటింగ్ చైర్ పర్సన్ తూర్పింటి ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రా నరేష్ కుమార్, సర్వీస్ చైర్ పర్సన్ మహేష్, డైరెక్టర్స్ ఏ. నాగరాజు, పత్ర రాకేష్, ప్రభాకర్ శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ, శంకర హాస్పిటల్ సిబ్బంది మరియు లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- అర్జీలను వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చు
- అర్జీలపై సమాచారం కొరకు మీకోసం కాల్ సెంటర్ నెంబర్ 1100ను సంప్రదించగలరు
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 15న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

### అన్ని శాఖలు సమన్వయంతో

# పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**







**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పి జి ఆర్ ఎస్ హాల్లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల సాధనకు ప్రో యాక్టివ్ గా పని చేయాలని, అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ వంటి సంక్షేమ పథకాల అమలులో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈనెల 15 మరియు 16వ తేదీలలో అమరావతిలో జరగబోయే కలెక్టర్ల సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాకు సంబంధించి అతి ముఖ్యమైన విషయాలపై వివిధ శాఖల జిల్లా అధికారులను పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన సమస్యలను ముందే గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు ప్రణాళికలు రూపొందించుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు భావన, కళ్యాణి డిఆర్ఓ మధుసూదనరావు, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు గ్రహీతకు ఆత్మీయుల చిరు సత్కారం

**- నరసప్ప ను ఘనంగా సత్కరించిన బార్ వాకర్స్**



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** కర్నూలు జిల్లా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ గా కర్నూలు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నరసప్ప ను అనంతపురం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ బార్ వాకర్స్ మిత్ర బృందం ఆదివారం నాడు ఘనంగా సన్మానించారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నరసప్ప అవార్డు తీసుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారని బార్ వాకర్స్ ఉపాధ్యాయులు ప్రసాద్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ శేఖర్, సీనా, టిడిపి నాయకులు రామకృష్ణ ( ఆర్ కే) , భాస్కర, పరదేశి, నాని, రెడ్డప్ప, అది, పాత్రికేయులు సులేమాన్ పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భావి తరాలకు అందించేందుకు నరసప్ప సేవలు మరింత అవ సరం అన్నారు. జిల్లా కలెక్టర్ చేత ఉత్తమ అవార్డు దక్కించుకుని అనంతపురం కు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం బార్ వాకర్ మిత్రబృందంకు ఆనందాన్ని కలిగించిందని, ఆయనను సన్మానించడం మా అందరి బాధ్యత అన్నారు. ఇలాంటి ఉత్తమ పదవులు, అవార్డుల మరెన్నో పొందాలని వారు ఆకాంక్షించారు.



## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అనంత బాలుడికి బంగారు పతకం




**అనంతపురం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** అనంతపురం చెందిన ఓ బాలుడు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించి ఔరా అనిపించాడు. అనంతపురం రాణి నగర్ అంగన్వాడీ టీచర్ లక్ష్మీ నరసమ్మ మనవడు అశ్విన్ శర్మ ఈ ఘనత సాధించాడు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నివాస ముంటున్న స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు శ్రీవాణి, వెంకట శేష శర్మ దంపతుల కుమారుడు అశ్విన్ శర్మ.. మదనపల్లిలోని విజయభారతి స్కూల్‌లో మొదటి తరగతి చదువుతున్నడు. కర్నూలులో జీ.కె.ఎం.ఎస్. ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 12వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. చిన్నారిని పలువురు అభినందించారు.

## టీడీపీ సీనియర్ నాయకులు కురువ నాగ రాజుకు నివాళులర్పించిన మోడీ శ్రీనివాస్ యాదవ్



**గుత్తి –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14 :** గుత్తి మండలం లచ్చన్ పల్లి గ్రామం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయ కులు ప్రస్తుత డీలరు కురువ నాగరా జు స్వర్గస్తులైన విషయం తెలుసుకు న్న గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మోడీ శ్రీనివాస్ యాదవ్ వారి స్వగ్రా మానికి వెళ్లి మృతినికి పూలమాల వే సి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుత్తి మా జీ మార్కెట్ చైర్మన్ మోడీ శ్రీనివాస్ యాదవ్, లచ్చన్న పల్లి మాజీ సర్పంచ్ తిరుపాల్,మస్తాన్,మాంజనే యులు, తదితరులు పాల్గొ న్నారు.

## నూతన ఎస్పీకి అభినందనలు




**పుట్టపర్తి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సతీష్ కుమార్ కు జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది పుష్పగుచ్చములు, పూల మొక్కలు, పండ్లతో ఎస్పీకి సాగర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలోని డిఎస్పీలు విజయ్ కుమార్, నరసింగప్ప, హేమంత్ కుమార్, శివన్నా రాయణ స్వామి, ఆదినారాయణ, ఏ ఆర్‌డిఎస్ పి శ్రీనివాసులు, ఏవో సుజాత సూపర్డెంట్ సరస్వతి మల్లికార్జున ఎస్పి సిసి చిరంజీవి, అర్ఐలు వలి, మహేష్ తో పాటు జిల్లాలోని సిఐలు ,ఎస్ఐలు , పోలీస్ సిబ్బంది, కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు, డిపిఓ సిబ్బంది నూతన ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## టీడీపీ బీసీ సెల్ సదస్సు పాల్గొన్న కర్నూలు ఉమ్మడి డీసీఎంఎస్ అధ్యక్షులు





**డోన్ –సూర్య వాస్తవం,సెప్టెంబర్ 14:** విజయవాడలో జరిగిన బీసీ సెల్ సదస్సులో మంత్రివర్యులు కొల్లు రవీంద్ర అద్వర్యం లో టీడీపీ బీసీ టీడీపీ బీసీ సెల్ సదస్సు విజయవాడలో జరిగింది. ఇందులో జాతీయ బీసీ సెల్ అధికారులు కర్నూలు, నంద్యాల జిల్లా ఉమ్మడి డీసీఎంఎస్ అద్యక్షులు అయిన వై నాగేశ్వర్ రావు యాదవ్ మాట్లాడుతు పెద్దలు మన ప్రియతమా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్యులు నారా లోకేష్ బాబు అద్వర్యంలో బీసీల అందరికి ఇందులో జాతీయ బీసీ సెల్ అధికారులు కర్నూలు, నంద్యాల జిల్లా ఉమ్మడి డీసీఎంఎస్ అద్యక్షులు అయిన వై నాగేశ్వర్ రావు యాదవ్ మాట్లాడుతు పెద్దలు మన ప్రియతమా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి వర్యులు నారా లోకేష్‌బాబు అద్వర్యంలో బీసీల అందరికి న్యాయము జరుగు తుందని ప్రజలలోకి సూపర్ సిక్స్ పథకాలను తిసుకెల్లాలని ప్రార్థించారు. బీసీ సెల్ సదస్సులో రాష్ట్రవ్యాప్త బీసీ సెల్ నాయకులు అందరూ పాల్గొన్నారు.

# సీఎం సారూ నా బిడ్డను కాపాడండి

- సాయం చేసే చూపులకై ఎదురుచూపు
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న నాగచైతన్య
- చికిత్సకు ప్రభుత్వం సహకరించాలంటూ తల్లి సుమలత వేడుకోలు
- దయార్ధుల సాయం కోసం ఎదురుచూపు
- ఆ బిడ్డ దీన స్థితి మారాలని మానవతా మూర్తులు కదలాలని ఆకాంక్ష



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడు నాగచైతన్య(15సం)కి మెరుగైన వైద్యం అందించి కాపాడాలని తల్లి బోనంశెట్టి సుమలత కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటుంది. వివరాల్లోకి వెళ్తే.. సుండుపల్లె మండల పరిధిలోని దిన్నెమీద బలిజపల్లి గ్రామానికి చెందిన బోనం శెట్టి నాగచైతన్య ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పది రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో రాయచోటిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చూపించారు. జ్వరం తగ్గకుండా తీవ్రమైన కడుపునొప్పి రావడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు వేలూరు సిఎంకి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహి ంచారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఇతనికి బోన్ బ్లడ్ క్యాన్సర్ వ్యాధిగా నిర్ధారించారు. చికిత్స కోసం దాదాపు 60 లక్షల వరకు ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబ సభ్యులు ఎటు తోచని దీనస్థితితో కుప్పకూలిపోయారు. తన భర్త జీవనోపాధి కోసం కువైట్ దేశంలో పని చేసుకుంటూ జీవనాన్ని నెటుకొస్తున్నాడని, తమ బిడ్డకు ఈ వింత వ్యాధి రావడంతో ఏం చేయాలో తమకు దిక్కుతోచలేదని ఆమె తమ బాధలను చెప్పుకుంటూ కుమిలిపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు తమ బిడ్డకు ప్రాణ బిక్ష పెట్టాలని ఆమె ప్రాధేయపడ్డారు. దాతలు కూడా ముందుకు వచ్చి తమ బిడ్డ వైద్యానికి సహాయం చేయాలని ఆమె వేడుకుంటున్నారు.

Account Name: BONAMSETTI NAGASATHVIKA Account Number: 31992200102750,Account Type: SBA IFSC Code: CNRB0013199,Branch : TSUNDUPALLI,Phone pay : 7780241309: Bank name - State Bank of India, Account name- R subanna.. Account number–11583195481:Ifsc code.. SBIN 0004427,Brach no- T. Sudupalli, Moblie no- 8143996798:Phone pay: 8143996798.

### ఆటో,క్యాబ్ డ్రైవర్లను

# నమ్మించి మోసం చేసిన తెలుగుదేశం

- కూటమి ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కండి
- ఆటో రాష్ట్ర ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు. ఎస్ రఫీ.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ.. ఆటో డ్రైవర్లకు పిలుపు

**పత్తికొండ టౌన్– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** ఉచిత బస్సు వల్ల ఆటో డ్రైవర్లను ఆదుకుంటానని వాగ్దానం ఇచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం వాహన మిత్ర ద్వారా 15000 మాత్రమే ఇస్తానని ఆటో డ్రైవర్లను మోసం చేసినది. మోసపూరిత వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆటో యూనియన్ రాష్ట్ర ఫెడరేషన్ కార్యదర్శి యస్.రఫి. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి ఎస్. రాధాకృష్ణ ఆటో డ్రైవర్లకు పిలుపు నిచ్చారు. ఆదివారం ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ. 5.వ జిల్లా మహాసభలు. పత్తికొండ పట్టణంలో ఈశ్వర్ రెడ్డి భవన్ సీఐటీయూ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగాయి. అంతకు ముందు పత్తికొండ పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి నాలుగు స్తంభాలు తేరు బజారు మీదుగా అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఈశ్వర్ రెడ్డి భవన్ కార్యాలయం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో జరిగిన ఆటో యూనియన్ ఐదవ




మహాసభలకు ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి రాధాకృష్ణ. పత్తికొండ నాయకులు ప్రభాకర్. అధ్యక్షత వర్గంగా మహాసభ జరిగింది. గత మహాసభ నుంచి ఈ మహాసభ వరకు మరణించిన వారికి ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి పి మహమూద్ సంతాపం తెలియ ప్రకటించారు.

# బల్లి కిరణ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్

- నిస్వార్థ సేవకుడు బల్లి కిరణ్ కుమార్‌కు ఢిల్లీలో దక్కిన గౌరవం
- బల్లి కిరణ్ కుమార్ ఎమ్.ఎస్.సి(మైక్రోబయాలజీ)





**నాయుడుపేట – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 14:** 108 అంబులెన్స్ లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తున్న బల్లి కిరణ్ కుమార్ కు ఎం బి ఆర్ యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. హర్యానా రాష్ట్రనికి చెందిన ఎమ్. బి.ఆర్ యూనివర్సిటి 2025 వ సంవత్సరానికి గాను ప్రతిభా,సామాజిక సేవ వంటి విభాగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అవార్డు ల ప్రధానం కార్యక్రమం యూనివర్సిటీ కన్వకేషన్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా నాయుడుపేట 108 అంబులెన్సులో ఏమర్జెన్సీ మెడికల్ టెక్నీషిన్ గా విధులు నిర్వహిస్తున్న బల్లి కిరణ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ అందించారు. బల్లి కిరణ్ కుమార్ ఎమ్.ఎస్.సి(మైక్రోబయాలజీ) బి ఈ డి,అడ్వాన్స్ డిప్లొమా ఇన్ ఏమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వంటి ఉన్నత విద్యను అభ్యసించి గత 19 సంవత్స రాలనుండి సేవా రంగం అయిన 108 అంబులెన్సులో అత్యవసర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారిని అనేక మందిని కాపాడారు. అలాగే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తన సొంత ఖర్చులుతో పేద గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం, వృద్ధాశ్రా మాలల్లో వృద్ధులుకు బట్టలు,ఆహరం, పండ్లు,నిత్యావసర వస్తువులు అందించడం, ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించడం, మానసిక స్థితి బాగోలేక కుటుంబానికి దూరంగా వచ్చేసిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబం వద్దకు చేర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత 9 సంవత్సరాలుగా 108 ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షులుగా, నాయుడుపేట రోటరీ క్లబ్ మెంబెర్‌గా పని చేస్తున్నారు. ఆయన సామాజిక సేవలను గుర్తించి గతం లో అర్పిత స్వచ్చంద సంస్థ,కల్చరల్ సోషల్ వాలంటీర్ ఆర్గనైజషన్ సంస్థ ఆంధ్రప్రదేశ్ వారిచే ఆంధ్రరత్న బిరుదును అందుకున్నారు. పలు స్వచ్చంద సంస్థ లు మరియు ఉప ముఖ్య మంత్రి,మంత్రి,ఐఏఎస్, ఐపీఎస్, జిల్లా స్థాయిలో అధికారులు ద్వారా పలు సన్మానాలు అవార్డులు రివార్డు లు అందుకొని ఉన్నారు. ఆయన వృత్తి సేవా రంగం,ప్రవృత్తి సామాజిక సేవగా తనకు తోచిన వంతుగా సేవలు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన హర్యాన ఎమ్ బి ఆర్ యూనివర్సిటీ వారు ప్రముఖులు, గౌరవ సుప్రీం కోర్ట్ సీనియర్ అడ్వకేట్ డాక్టర్ గీతాంజలి శర్మ,మాజీ రాష్ట్రపతి శంకర దయాల్ శర్మ మనమరాలు ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ బింధు భార్గవ్,హర్యానా రాష్ట్ర టూరిజం జనరల్ మేనేజర్ డాక్టర్ రాజ్ పాల్, హర్యానా రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ అడ్వకేట్ సంధ్యా గుప్తా,హర్యానా రాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ కమలేష్ శాస్త్రి,ఎమ్ బి ఆర్ యూనివర్సిటీ సెనిట్ సభ్యులు జి విజయకుమార్,ఎమ్ బి ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సిపి యాదవ్ లు గౌరవ డాక్టరేట్ ను బల్లి కిరణ్ కుమార్ కు అందించారు. ఈ సందర్భంగా ఆయన సహా ఉద్యోగులు ప్రము ఖులు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, మిత్రులు, శ్రేయోభిలాషులు బల్లి కిరణ్ కుమార్ కు అభిన ందనలు తెలియజేశారు.

# మేం పార్టీ మారలేదండి....

**హైదరాబాద్ – సూర్య వాస్తవం:** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం వివాదాస్పదమైంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు అధికర కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనిపై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎన్నిక రద్దు చేయాలని కోరింది. కోర్టు చర్య తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆదేశించింది. స్పీకర్ జాప్యం చేయడంతో బీఆర్ఎస్ నేతలు సుప్రీం కోర్టును ఆశ్రయి ంచారు. దీంతో సుప్రీం కోర్టు పార్టీ మారిన ఎమ్మెల్యేపై చర్యలకు గడువు విధించింది. దీంతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇటీవలే నోటీసులు జారీ చేశారు. దీంతో పది మంది ఎమ్మెల్యేలు తాజాగా స్పీకర్ నోటీసులకు వివరాణ ఇచ్చారు. అయితే విశేషం ఏమిటంటే పది మంది ఎమ్మెల్యేల్లో 8 మంది తాము పార్టీ మారలేదని వివరణ ఇవ్వడం ఇప్పుడు ఆశ్చరకరంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని ప్రతిపక్షం ఆరోపించింది. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం, వారిని అనర్హులుగా ప్రకటించాలని పిటిషన్లు దాఖల య్యాయి. సుప్రీంకోర్టు గత జులై 31న తీర్పు ఇచ్చి, స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆదేశాలు ఆలస్యాన్ని విమర్శించి, పార్లమెంట్‌కు ఈ విధానాన్ని పునర్విచారించాలని సూచించింది. ఫిబ్రవరి నుంచి నోటీసులు జారీ అయ్యాయి, ఇది రాజకీయ ఒత్తిడిని పెంచింది. ఈ కేసు రాష్ట్రంలో పార్టీ మార్పులకు ఆటంకం కల్పుతున్నట్లు కనిపిస్తోంది.ఎనిమిది మంది ఎమ్మెల్యేలు లిఖితపూర్వకంగా స్పీకర్‌కు సమాధానాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం నియో జకవర్గాల అభివృద్ధి కోసమేనని, పార్టీ సభ్యత్వం మార లేదని



చెప్పారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ వంటివారు బీఆర్ఎస్ సూత్రాలకు నిబద్ధులమని పేర్కొన్నారు. కొందరు తమ ఫొటోలను మార్ఫింగ్ చేశారని, సీఎంతో కలయికలు గౌరవార్థమేనని వివరించారు. ఇక దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం మరిన్ని రోజులు కావాలని కోరారు. 8 మంది ఎమ్మెల్యేకు ఇందుకు ఆధారాలు కూడా చూపించారు. స్పీకర్ వాటిని ఫిరాయింపు ఆరోపణలు చేసినవారికి పంపారు.కొందరు ఎమ్మెల్యేలకు ప్రభుత్వ పదవులు లభించాయి. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యవసాయ సలహాదారు పాత్ర, అరికెపూడి గాంధీకి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ స్థానం ఇచ్చారు. ఇది బీఆర్ఎస్‌లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. గతంలో అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసి, పార్టీలో బ్రోకర్లు ఉన్నారని అన్నారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పడం మాట మార్పుగా కనిపిస్తోంది. పాడి కౌశిక్‌రెడ్డి వంటి నాయకులు సవాల్ విసిరారు. ఈ పదవులు ఫిరాయింపు ఆరోపణలను మరింత బలపరుస్తున్నాయి, ఎందుకంటే అవి ప్రతిపక్షాలకు కేటాయించాల్సినవి.స్పీకర్ ప్రసాద్ కుమార్ ఒక్కొక్కరినీ విచారించనున్నారు. బీఆర్ఎస్ ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, న్యాయవాదులు హాజరుకావాలి. విచారణలు ఆలస్యం చేయకుండా చూడాలని స్పీకర్ హెచ్చరించారు. ఈ ప్రక్రియ బీఆర్ఎస్‌కు ప్రయోజనం కలిగించవచ్చు, ఎందుకంటే ఫిరాయింపులు ఆగిపోయాయి. మొత్తంగా, ఈ కేసులు తెలంగాణలో రాజకీయాలను మార్చవచ్చు. అనర్హత తీర్పు వచ్చిన తర్వాత ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇది కాంగ్రెస్ ఆధిపత్యాన్ని పరీక్షిస్తుంది. రాజ్యాంగపరమైన బాధ్యతలు, రాజకీయ అవకాశవాదం మధ్య సమతుల్యత అవసరమని ఈ సంఘటనలు సూచిస్తున్నాయి.

# కవితకు అండగా కేసీఆర్...



**హైదరాబాద్ – సూర్య వాస్తవం:** ఆడబిడ్డ ఏడిస్తే ఇంటికి మంచిది కాదు అంటారు. తెలంగాణ సమాజం ఈ సామెతను బలంగా నమ్ముతుంది. ఆడబిడ్డను సాక్షాత్తు ఇంటి దేవతగా కొలుస్తూ ఉంటుంది. ప్రతి పండుగకు చీరె సారే పెడుతూ గౌరవించుకుంటుంది. దీనికి ఏ కుటుంబం కూడా మినహాయింపు కాదు. తెలంగాణ అంటేనే ఒక బలమైన అస్తిత్వానికి ప్రతీక. అందువల్లే ఇక్కడ చాలా దృఢమైన ఉద్యమాలు పుట్టాయి. ఆ ఉద్యమాలలో ఆడవారి పాత్రను బలంగా నిలుపుకున్నాయి. సమ్మక్క సారలమ్మ.. రుద్రమదేవి.. చాకలి ఐలమ్మ.. ఇలా చెప్పుకుంటూ పోతే వీరవనితలు.. ధీర వనితలు చాలామంది ఉన్నారు. వారందరూ ఇప్పటికీ కూడా ప్రజల మదిలో మెదులు తున్నారు. తెలంగాణ సమాజం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ వనితలను మననం చేసుకుంటూ ముందుకు సాగింది. తమ స్వీయ అస్తిత్వాన్ని కాపా డుకుంటూ అడుగులు వేసింది. అలా అడుగులు వేసిన వారిలో కల్వకుంట్ల కవిత కూడా ఒకరు.తెలంగాణ ఉద్యమ సమయంలో.. తెలంగాణకు అస్తిత్వం అయిన బతుకమ్మను నెత్తిన పెట్టుకుని ఆమె చేసిన సాంస్కృతిక ఉద్యమం మామూలుది కాదు. తెలంగాణ ఆడబిడ్డల్ని ఉద్యమంలో మమేకం చేయడానికి ఆమె ఎత్తుకున్న బతుకమ్మ ఎంతో మందిని కదిలించింది. కదిలి వచ్చేలా చేసింది. తెలంగాణ సాంస్కృతి.. తెలంగాణ సంప్రదాయం అంటేనే బూతు లాగా ధ్వనించిన ఒక సందర్భంలో.. బతుకమ్మ ద్వారా వాటన్నింటిని పటాపంచలు చేసింది కవిత. అందువల్లే ఆమె తెలంగాణ బతుకమ్మగా పేరుపొందింది. ఎంగిలి పూల నుంచి మొదలుపెడితే సద్దుల బతుకమ్మ వరకు ఆమె అడుగు పెట్టని ఊరంటూ లేదు. గౌరమ్మను నిలుపుకోవడం.. తంగేడు పూలతో బతుకమ్మను పేర్చడం.. పాటలు పాడి చెరువులో నిమజ్జనం చేయడం.. ఇదే క్రతువుగా సాగిపోయింది కవిత. అటువంటి బతుకమ్మకు నేడు కష్టం వచ్చింది. పుట్టిన ఇంటి నుంచి ఇబ్బందికరమైన వాతావరణం ఎదురైంది. పండగపూట ఏ ఆడబిడ్డకు ఇటువంటి కష్టం రావద్దు. ఇటువంటి ఇబ్బంది అసలు రావద్దు. పున్నమి 15 రోజుల్లో వెలుగు వెలిగే చంద్రుడు కూడా.. అమావాస్య రోజులలో మసకబారతాడు. అలాగని ఎప్పటికీ చీకట్లో ఉండిపోడు. ఇప్పుడు కవిత పరిస్థితి కూడా అలాంటిదే. తాత్కాలికంగా ఆమె ప్రభ కొంతమేర ఇబ్బందికి గురైనప్పటికీ.. ఆ తర్వాతి రోజుల్లో దీపశిఖలాగా వెలుగుతూనే ఉంటుంది. కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్మే ఆమె.. ఎట్టి పరిస్థితుల్లోనూ తన ప్రభను కోల్పోరు.పుట్టినింటి నుంచి కాస్త ఇబ్బంది ఎదురవుతున్నప్పటికీ.. మేమున్నామంటూ పుట్టిన గడ్డవాళ్ళు కవిత దగ్గరికి వచ్చారు. కెసిఆర్ స్వగ్రామం చింతమడక గ్రామస్తులు తెలంగాణ బతుకమ్మ దగ్గరికి స్వయంగా వచ్చి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో భాగస్వామి కావాలని స్వాగతం పలికారు. చీర, సారె, పసుపు కుంకుమలతో సాదర ఆహ్వానం పలికారు. ఒక ఆడబిడ్డకు ఇంతకంటే కావలసిందేముంది. పండగ పూట ఇంతకంటే ఘనమైన ఆతిథ్యం ఇంకొకటి ఏమంటుంది. ఇది తెలంగాణ బతుకమ్మకు దక్కిన నిండైన గౌరవం. కెసిఆర్ కుమార్తెకు కెసిఆర్ స్వగ్రామం నుంచి లభించిన గొప్పదైన సత్కారం. ఇప్పుడు కవిత మనసు చాలా తేలికైంది. గుండెలో భారం తగ్గిపోయింది. ఎందుకంటే తెలంగాణ బతుకమ్మ దగ్గరికి బతుకమ్మ వడివడిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది కాబట్టి..

# బరితెగిస్తున్న లీడర్లు...

**నల్గొండ – సూర్య వాస్తవం:** సదుకుంటేనే పని జరుగుతుంది.. వారానికి రెండుసార్లు వస్తే చాలుశీర్షిక చదివి మమ్మల్ని తిట్టుకుంటున్నారు కదూ. మీ స్థానంలో మేము ఉంటే అలాగే తిట్టుకునే వాళ్ళం. కనబడితే రెండు చెంపలు వాయించే వాళ్ళం కూడా. ఎందుకంటే ఆ శీర్షిక అలా ఉంది కాబట్టి. వాస్తవానికి ఈ తరహా భాషను ప్రయోగించాలంటే మాకు కూడా చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎందుకంటే మా న్యూస్ వెబ్సైట్ ను అందరూ చూడాలనేదే తాపత్రయం. అంటే తప్ప ఒక సెక్షన్ రీడర్స్ చదవాలనేది కాదు. కాకపోతే జరిగిన దారుణం అటువంటిది. ఇటువంటి దారుణాన్ని వెలుగులోకి తీసుకొచ్చే క్రమంలో ఆ తరహా భాష వాడక తప్పడం లేదు. పెద్ద మనసుతో క్షమిస్తారని కోరుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలని ఏలుతున్న నాయకులు చెబుతుంటారు. పెద్దపెద్ద సమావేశాలు పెట్టు మరి గొప్పగా వ్యాఖ్యానిస్తూ ఉంటారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పేదవాడికి చేరితే అంతకుమించిన ఆనందం ఇంకొకటి ఉండదు. ఎందుకంటే పథకం అనేది పేదవాళ్లకు చేరినప్పుడు క్రమక్రమంగా పేదరికం తగ్గిపోతుంది. తద్వారా జీవించే హక్కు.. అందరికీ సమానంగా ఉంటుంది. ఒకరి మీద ఆధారపడకుండా స్వశక్తితో బతికే వారి సంఖ్య పెరుగుతుంది. అంతకు మించిన ఆనందం ఇంకెక్కడ ఉంటుంది. పైగా పథకాలను పకడ్బందీగా ప్రభుత్వాలు అమలు చేస్తే.. వాళ్ల అధికారానికి ఇబ్బంది ఉండదు. కానీ మన ప్రభుత్వాలు అలా చేయవు కదా. పథకాల విషయంలో అధికార పార్టీ నేతల నొక్కుడు ఎక్కువగా ఉంటుంది కదా. పైగా అధికార పార్టీ నేతలకు పేటెంట్ రైట్ మాదిరిగా ప్రభుత్వ పథకాలు ఉంటాయి కదా.. పైగా ఇలాంటి వ్యవహారాలలో ఏ వ్యవస్థలు జోక్యం చేసుకోలేవు. జస్ట్ చూస్తూ ఉంటాయి.పేదలకు పథకాలు కావాలి కాబట్టి నేతల చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఆ అధికార పార్టీలో ఉన్న నాయకులు పేదల అవకాశాన్ని ఆసరాగా చేసుకొని రకరకాల వ్యవహారాలకు పాల్పడుతుంటారు. అయితే తెలంగాణలోని ఓ ప్రాంతంలో ఓ ప్రభుత్వ పథకానికి సంబంధించి ఓ మహిళ అధికార పార్టీ నాయకుడిని కలిసింది. మొదట్లో కచ్చితంగా చేస్తానని హామీ ఇచ్చిన అతడు.. ఆ తర్వాత ఆమెను అనేక పర్యాయాలు తన వద్దకు రప్పించుకున్నాడు. వచ్చిన ప్రతి సందర్భంలో ఆమె అందం అతడిని భూమి మీద నిలువనీయకుండా చేసేది. దీంతో అతడు ఆమె అందాన్ని సొంతం చేసుకోవాలని అనుకున్నాడు. ఇందులో భాగంగానే ఆమె ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. ఇక అప్పటినుంచి అసలు కథ మొదలుపెట్టాడు.తన వద్దకు రావాలని.. మల్లెపూలు పెట్టుకోవాలని.. అందంగా తయారు కావాలని.. వారానికి రెండుసార్లు వచ్చిపోతే సరిపోతుందని.. డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వ పథకమే కాదు ఇంకా చాలా అందుతాయని ఆఫరించాడు. దీంతో ఆమె భయపడిపోయింది. ఇలాంటిది తప్పని చెప్పింది. అయినప్పటికీ అతడు వినిపించుకోలేదు. దీనికి తోడు మరింత దూకుడుగా వెళ్లడం మొదలుపెట్టాడు.. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె ఒప్పుకుంది. అయితే అతని బాగోతాన్ని మొత్తం ఫోన్లో రికార్డ్ చేసింది. అది కాస్త సోషల్ మీడియాలోకి ఎక్కడంతో ఒక్కసారిగా సంచలనం నమోదయింది.ఇక్కడ పేర్లు బయట పెట్టవచ్చు. ప్రాంతాలతో సహా వెల్లడించవచ్చు. లీగల్ గా ఇబ్బంది అవుతుంది కాబట్టే ఆ వివరాలు బయట పెట్టడం లేదు. సాధారణంగా అధికార పార్టీ అనగానే కార్యకర్తలకు కొమ్ములు ఉండవు. నాయకులకు పేటెంట్ రైట్స్ ఉండవు. అధికారమనేది కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత మారిపోతూ ఉంటుంది. కానీ ఇటువంటి నాయకులు అధికార పార్టీలో ఉంటే మాత్రం అధికారం ఐదేళ్లు కాదు కదా.. ఐదు నిమిషాలు కూడా ఉండదు.

## ఆర్టీసీ అప్ డేట్




**హైదరాబాద్ – సూర్య వాస్తవం:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. స్మార్ట్ కార్డులను ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించింది. తెలంగాణ ఆర్టీసీ టికెటింగ్ , బస్ పాస్ వ్యవస్థను ఆధునీకరించడానికి సిద్ధమవుతోంది. ఇందుక ోసం ప్రయాణాలకు స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టనుంది. మొదట ఈ సౌకర్యాన్ని విద్యార్థుల బస్ పాస్‌లతో ప్రారంభించి, తరువాత మహిళల కోసం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం లబ్ధిదారులకు విస్తరించనున్నట్లు అధికారిక వర్గాలువెల్లడించాయి. టీజీఆర్టీసీ అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం, బస్ పాస్‌లు పొందడం, రెన్యువల్ చేయడం మరింత సులభం కావడంతో పాటు, సంస్థ డిజిటల్ టెక్నాలజీకి అనుగుణంగా ముందడుగు వేయనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షలకుపైగా విద్యార్థి బస్ పాస్‌లు ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పటివరకు విద్యార్థులు రెన్యువల్ కోసం ప్రత్యేక కౌంటర్లకు వెళ్లాల్సి వచ్చింది. ప్రతిపాదిత స్మార్ట్ కార్డు వ్యవస్థ అమలులోకి వస్తే, వీటిని డిజిటల్‌గా రీచార్జ్ చేసుకోవచ్చు. ఇకపోతే, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో అమలులో ఉన్న స్మార్ట్ కార్డు మోడళ్లను ఆర్టీసీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే బెంగళూరు, ముంబై, లక్నో వంటి మహానగరాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందని తెలుసుకున్న టీజీఎస్ ఆర్టీసీ అధికారులు రాష్ట్రంలోనూ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో ఉన్న పద్ధతిని, అక్కడ స్మార్ట్ కార్డులు మంజూరు చేసే విధానాన్ని అధ్యయనం చేయనుంది. . ఎప్పటి నుంచి అంటే? అధ్యయనం చేసిన తర్వాత... ఆ యా రాష్ట్రంలో సమగ్ర అధ్యయనం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులను గుర్తించి, తెలంగాణలో ప్రయాణికులకు అనుకూలంగా అమలు చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం రాబోయే నెలల్లో దశలవారీగా ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించడానికి మహిళలు తమ ఆధార్ కార్డులు చూపించాల్సి వస్తోంది. స్మార్ట్ కార్డులు ప్రవేశిస్తే ఈ ధృవీకరణ అవసరం ఉండదు. దీంతో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు వినియోగించే లక్షలాది మహిళలకు మరింత సౌలభ్యం కలుగుతుందని భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నమూనాలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే స్మార్ట్ కార్డుల రూపకల్పన పై టీజీ ఆర్టీసీ తుది నిర్ణయం తీసుకోనుం

## జూపల్లి కామెంట్స్ పై చర్చోపచర్చలు

**మహబూబ్ నగర్ – సూర్య వాస్తవం:** ఏ మనిషినైనా సరే ఆశావహ దృక్పథం ఉండాలి. సాధిస్తాను అనే సంకల్పం ఉండాలి. గెలుస్తాను అని నమ్మకం ఉండాలి. అలా అయితేనే ముందుకు వెళ్ళగలుగుతారు. అలాకాకుండా నిరాశతో, నిస్పృహతో, భయంతో ఉంటే ఎప్పటికైనా సరే ఓడిపోతారు. ప్రస్తుతం 30 లక్షణాలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో నాయకుల్లో ఒక రకమైన భయం కనిపిస్తోంది. గులాబీ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరినప్పటికీ.. ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ నోటీసులు ఇవ్వడంతో ఒక్కసారిగా స్వరం మార్చారు. తాము అభివృద్ధినిధుల కోసం మాత్రమే ముఖ్యమంత్రిని కలిసినట్టు కవరింగ్ ఇచ్చారు. ఇందులో ఇంకా కడియం శ్రీహరి, మరో ఎమ్మెల్యే వివరణ ఇవ్వాల్సి ఉంది. వీరు మాత్రమే కాదు, మిగతా ఎమ్మెల్యేలు కూడా భయం భయంతోనే ఉన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుంటే విదేశాలకు వెళ్తున్నారు. రైతులు ధర్నా చేస్తుంటే విదేశాల్లో ఉండి వారు వినోదం చూస్తున్నారు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రమే కాదు.. భయపడుతున్న వారి జాబితాలోకి ఇప్పుడు ఈ జాబితాలోకి మంత్రులు చేరిపోయారు.తాజాగా మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులెత్తేశారు.. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లోని బోద్ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని అక్కడి ప్రజలు ఆయనను డిమాండ్ చేశారు. దీనిపై కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. " వచ్చేసారి నేను గెలుస్తానో లేదో తెలియదు. ఒకవేళ నేను గెలిచినా కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందో రాదో తెలియదు. అందువల్లే నేను ప్రజలకు ఎటువంటి హామీ ఇవ్వవలేను.. నా జేబులో నుంచి ఖర్చుపెట్టే డబ్బు అయితే చెప్పగలను. ప్రభుత్వం నుంచి వచ్చేదానికి నేను హామీ ఇవ్వలేను" అని మంత్రి స్పష్టం చేశారు.. దీంతో ఆయన చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలలో సంచలనంగా మారాయి. మరో రెండు పర్యాయాలు తానే ముఖ్యమంత్రి అని రేవంత్ చెప్పుకుంటుంటే.. కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి.ఇటీవల కాలంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అదృష్టం మీద నేరుగా విమర్శలు చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వలేదని మండిపడుతున్నారు. ఏకంగా ముఖ్యమంత్రి మాట్లాడుతున్న మాటలకే గట్టి కౌంటర్ ఇస్తున్నారు. పుచ్చుకుపల్లి మాత్రం ఏకంగా కాంగ్రెస్ ప్రభుత్వమే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాదని స్పష్టం చేస్తున్నారు.. అంటే ఇప్పుడు ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ఆగ్రహం ఉన్నట్టే కదా.. ప్రభుత్వం చేపడుతున్న ఏ పని కూడా ప్రజల్లోకి వెళ్లడం లేదనే కదా.. మరి దీనిపై ముఖ్యమంత్రి ఎలా స్పందిస్తారు.. ఎలాంటి ప్రకటన చేస్తారనేది చూడాల్సి ఉంది. అన్నట్టు జూపల్లి కృష్ణారావు మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తొలి రోజుల్లో ఆయన నియోజకవర్గంలో జరిగిన ఓ ఘటన సంచలనం రేపింది. దాని వెనుక ఉన్నది కృష్ణారావు అని ప్రచారం కూడా జరిగింది. అప్పటినుంచి ఆయన ఏ సభలో కూడా ఆశావాహ దృక్పథంతో మాట్లాడటం లేదని గులాబీ నాయకులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి అర్థమైంది కాబట్టి మంత్రులు వాస్తవాలు మాట్లాడుతున్నారని.. కృష్ణారావు జ్ఞానోదయం అయిందని.. మిగతా వారికి కూడా త్వరలోనే అవుతుందని గులాబీ నేతలు అంటున్నారు.






### ‘ఉస్తాద్ భగత్ సింగ్’

# షూటింగ్ పూర్తి చేసిన పవర్ స్టార్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’. ‘గబ్బర్ సింగ్’ వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్-హరీష్ శంకర్ కలయికలో వస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం భారీ షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించింది. దీంతో పవన్ కళ్యాణ్ తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు. ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమాపై నెలకొన్న ఆకాశాన్ని తాకే అంచనాలను అందుకునేందుకు చిత్ర బృందం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. ఈ సినిమా కోసం అత్యున్నత స్థాయి సాంకేతిక బృందం పనిచేస్తోంది.



రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. రామ్-లక్ష్మణ్ ద్వయం యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. అయనంక బోస్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తుండగా, నీతా లుల్లా కాస్ట్యూమ్స్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కళా దర్శకుడిగా ఆనంద్ సాయి వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు.. మాస్ ప్రేక్షకులు, యాక్షన్ ప్రియులు మెచ్చేలా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్న తరుణంలో చిత్ర బృందం త్వరలోనే నిర్మాణాంతర కార్యక్రమాలను మొదలు పెట్టనుంది. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

# సరికొత్తగా.. వినూత్నంగా...



సినిమా ఈ శతాబ్దంలోనే పుట్టి పరిమళించిన సమాహార కళారూపం. జన సామాన్యానికి అందుబాటులో ఉండి వారిని అమితంగా ఆకర్షిస్తున్న ఏకైక సాహితీ రూపం కూడాను. అలాంటి సినిమాల్లో యువతను ఆకట్టుకునే కథలతోపాటుగా యువత ఎదుర్కొనే సామాజిక, భావోద్వేగ, సృజనాత్మక అంశాలను పట్టిచూపుతూ కూడా చాలా సినిమాలు వస్తున్నాయి. మొదట్లో నిరుద్యోగం, చదువు సంధ్యలు, వివాహాలు, కుల, మతపరమైన భావనలతోనూ కొన్ని కథనాలు వచ్చాయి. దర్శకుల ప్రతిభ, నటీనటుల అనునయం వెరసి చాలా సినిమాలు సందేశాత్మకంగా ముందుకు సాగుతూ ఆబాల గోపాలాన్ని ఆకట్టు కుంటూనే ఉన్నాయి. నాటి పాతతరం నుంచి నేటి కొత్తతరం వరకూ కూడా ప్రేమ కథా చిత్రాలకు కొదవే లేదు. ప్రేమ అంశాలను ఇతివృత్తంగా తీసుకుని వచ్చిన సినిమాలు సైతం బాక్సాఫీసు వద్ద రికార్డులు కొల్లగొట్టాయి. సామాజిక సమస్యను పట్టిచూపిన ‘కోర్టు’ సినిమా సరికొత్త విజయాన్ని సొంతం చేసుకుంది. తొలిప్రేమ (1998)లో పవన్ కళ్యాణ్, కీర్తి రెడ్డి పాత్రలకు తగ్గట్టుగా నటించారు. ఒక్కడు (2003)లో మహేష్‌బాబు, భూమిక మంచిగానే నటించారు. బొమ్మరిల్లు (2006) కొడుకు పట్ల తండ్రి ‘పొజెసివ్‌నెస్’ని ఒక కథాంశంగా తీసుకుని తండ్రీ కొడుకుల మధ్య ఉండాల్సిన ‘స్పేస్’ని డిస్కస్ చేసిన సినిమా. హీరోగా సిద్ధార్థ, హీరోయిన్‌గా జెనీలియా పోటీపడి నటించారు. నువ్వు నాకు నచ్చావ్ (2001) సినిమా వెంకటేష్, ఆర్తి అగర్వాల్ నటించిన ప్రేమ కథా చిత్రం. ‘గమ్యం 2008’ సినిమా పైకి ప్రేయసిని వెతుక్కుంటూ ప్రియుడు చేసే మోటార్ సైకిల్ యాత్రగా కనిపించినా ఒక రకంగా అది అతడి అంతర్గత ప్రయాణం. శర్వానంద్, కమలినీ ముఖర్జీ సినిమాలో జంటగా నటించారు. ఘాజీ సినిమా ద్వారా యువ దర్శకుడు సంకల్ప్‌రెడ్డి జాతీయ అవార్డును సైతం కైవసం చేసుకున్నారు.

**కోచింగ్ సెంటర్‌లో ప్రేమే ‘లిటిల్‌హార్ట్స్’:** తాజాగా ‘లిటిల్ హార్ట్స్’ సినిమా ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొంటోంది. ఈటీవీ విన్ ప్రొడక్షన్ నుంచి వచ్చిన మొట్ట మొదటి థియేట్రికల్ కూడా ఇదే కావటం విశేషం. ’90స్ మిడిల్‌క్లాస్ బయోపిక్’తో యువతకు చేరువైన మౌళి తనూజ్ ఇందులో కథానాయకుడిగా నటించారు. దర్శకుడు ఆదిత్య హసన్ దీనికి నిర్మాత. ఈనెల ఐదోతేదీన విడుదలైన ఈ సినిమా పెద్ద సినిమాలను సైతం పక్కకు నెట్టేసి అప్రతి హతంగా ముందుకు సాగుతోంది. కథలోకి వెళ్తే అఖిల్ (మౌళి తనూజ్) చదువుల్లో అంతంత మాత్రమే. అందుకే ఎంసెట్‌లో ర్యాంక్ రాదు. పేమెంట్ సీట్‌తో ఏదో ఒక కాలేజీలో ఇంజినీరింగ్ చేరాలనుకుంటాడు. కానీ, తండ్రి గోపాలరావు (రాజీవ్ కనకాల) మాత్రం లాంగ్ టర్మ్ కోచింగ్‌కి పంపిస్తాడు. కాత్యాయని (శివానీ నాగారం)ది కూడా అదే కథే. ఆమె తల్లిదండ్రులిద్దరూ డాక్టర్లే. తమ కూతురిని కూడా డాక్టర్‌గా చూడాలనేది వాళ్ల లక్ష్యం. అందుకే కాత్యాయని కూడా ఇంటర్ తర్వాత లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో చేరుతుంది. అక్కడే అఖిల్, కాత్యాయని పరిచయమవుతారు. ఆ పరిచయం ప్రేమకు దారి తీస్తుంది. అఖిల్ తన మనసులో మాటని బయట పెడతాడు. అప్పుడు కాత్యాయని తనకు సంబంధిం చిన ఓ విషయాన్ని బయట పెడుతుంది. దాంతో ఈ జంట ప్రేమకథలో ఓ పెద్ద మలుపు. ఇంతకీ కాత్యాయని చెప్పిన ఆ విషయం ఏమిటి? వీళ్లిద్దరి మధ్య ప్రేమకి ఎదురైన సమస్య ఏమిటి? ఆ ప్రేమ కథ కంచికి చేరిందా లేదా? అనేది మిగతా కథ.



# భారత్ జయభేరి

**పాక్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం**
**అదరగొట్టిన బుమ్రా, కులదీప్, పాండ్యా**



**దుబాయ్ :** ఆసియా కప్ 2025లో భారత్ జయభేరి మోగించింది. పాకిస్థాన్‌పై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత బౌలర్ల దెబ్బకు పాక్ జట్టు విలవిలాడింది. ఈ రెండు జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 127 పరుగులు మాత్రమే సాధించింది. భారత బౌలర్లు చెలరేగిపోవడంతో 9 వికెట్ల కోల్పోయింది. ఆ తర్వాత స్వల్ప లక్ష్యాన్ని భారత్ బ్యాటర్లు అలవోకగా చేధించారు. 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సూర్యకుమార్ యాదవ్ (47లిబీ 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అదరగొట్టాడు. తిలక్ వర్మ (31బీ 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ (31బీ 13 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు బౌండరీలతో అలరించాడు. శుభ్‌మన్ గిల్ (10) తక్కువస్కోరుకే వెనుదిరిగాడు. శివమ్ దూబె (10లి) నాటౌట్‌గా నిలిచాడు.

పాక్ జట్టులో సాహిబ్‌జాదా ఫర్హాన్ (40) టాప్ స్కోరర్‌గా నిలిచారు. షాహీన్ అఫ్రిది (33), ఫకర్ జమాన్ (17), ఫహీమ్ అష్రఫ్ (11), ముఖీమ్ (10) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ మూడు, అక్షర్ పటేల్, బుమ్రా రెండు చొప్పున, హార్దిక్ పాండ్య, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ తీశారు. టీం ఇండియా బౌలర్లలో తొలి ఓవర్ వేసిన హార్దిక్ పాండ్య.. తొలి బంతికే సయిమ్ అయూబ్ (0)ను గోల్డెన్ డక్‌గా పెవిలియన్ బాట పట్టించాడు. రెండో ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో మహమ్మద్ హారిస్ (3) బుమ్రాకు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత సాహిబ్‌జాదా ఫర్హాన్, ఫకర్ జమాన్‌లు ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. 7.4 ఓవర్‌లో ఫకర్ జమాన్‌ను అక్షర్ పటేల్ ఔట్ చేశాడు. 13వ ఓవర్‌లో కుల్దీప్ రెండు వికెట్లు తీశాడు. చివర్లో షాహీన్ అఫ్రిది దూకుడుగా ఆడాడు. దీంతో పాక్ జట్టు స్కోరు 100 దాటింది.

భారత్ జయభేరి
పాక్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం
అదరగొట్టిన బుమ్రా, కులదీప్, పాండ్యా
దుబాయ్ : ఆసియా కప్ 2025లో భారత్ జయభేరి మోగించింది. పాకిస్థాన్‌పై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత బౌలర్ల దెబ్బకు పాక్ జట్టు విలవిలాడింది. ఈ రెండు జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 127 పరుగులు మాత్రమే సాధించింది. భారత బౌలర్లు చెలరేగిపోవడంతో 9 వికెట్ల కోల్పోయింది. ఆ తర్వాత స్వల్ప లక్ష్యాన్ని భారత్ బ్యాటర్లు అలవోకగా చేధించారు. 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సూర్యకుమార్ యాదవ్ (47లిబీ 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అదరగొట్టాడు. తిలక్ వర్మ (31బీ 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ (31బీ 13 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు బౌండరీలతో అలరించాడు. శుభ్‌మన్ గిల్ (10) తక్కువస్కోరుకే వెనుదిరిగాడు. శివమ్ దూబె (10లి) నాటౌట్‌గా నిలిచాడు.
పాక్ జట్టులో సాహిబ్‌జాదా ఫర్హాన్ (40) టాప్ స్కోరర్‌గా నిలిచారు. షాహీన్ అఫ్రిది (33), ఫకర్ జమాన్ (17), ఫహీమ్ అష్రఫ్ (11), ముఖీమ్ (10) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ మూడు, అక్షర్ పటేల్, బుమ్రా రెండు చొప్పున, హార్దిక్ పాండ్య, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ తీశారు. టీం ఇండియా బౌలర్లలో తొలి ఓవర్ వేసిన హార్దిక్ పాండ్య.. తొలి బంతికే సయిమ్ అయూబ్ (0)ను గోల్డెన్ డక్‌గా పెవిలియన్ బాట పట్టించాడు. రెండో ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో మహమ్మద్ హారిస్ (3) బుమ్రాకు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత సాహిబ్‌జాదా ఫర్హాన్, ఫకర్ జమాన్‌లు ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. 7.4 ఓవర్‌లో ఫకర్ జమాన్‌ను అక్షర్ పటేల్ ఔట్ చేశాడు. 13వ ఓవర్‌లో కుల్దీప్ రెండు వికెట్లు తీశాడు. చివర్లో షాహీన్ అఫ్రిది దూకుడుగా ఆడాడు. దీంతో పాక్ జట్టు స్కోరు 100 దాటింది.

# అమ్మాయిలకు నిరాశే




**- ఫైనల్లో 1-4తో భారత్ ఓటమి**
**- మహిళల హాకీ ఆసియా కప్**

**గాంగ్ఝ (చైనా) :** 2025 మహిళల హాకీ ఆసియా కప్ విజేతగా చైనా నిలిచింది. ఆదివారం చైనాలోని గాంగ్ఝలో జరిగిన ఫైనల్లో భారత్‌పై 4-1తో ఆతిథ్య చైనా సాధికారిక విజయం సాధించింది. టైటల్ పోరులో తొలి నిమిషంలోనే పెనాల్టీ కార్నర్‌లు సాధించిన భారత్.. 1వ నిమిషంలోనే 1-0 ఆధిక్యం సాధించింది. ఫార్వర్డ్ నవనీత్ కౌర్ మ్యాచ్ మొదలైన 59వ క్షణంలోనే పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచింది. భారత్‌కు 1-0తో ఆధిక్యంతో పాటు మానసికంగా పైచేయి సాధించేలా చేసింది. తొలి క్వార్టర్‌లో చైనాను నిలువరించిన భారత్ డిఫెన్స్.. రెండు, మూడో క్వార్టర్స్‌లో గోల్ కోల్పోయింది. 21వ నిమిషంలో జిక్సియా, 41వ నిమిషంలో లీ హాంగ్‌లు గోల్స్ కొట్టారు. దీంతో రెండో క్వార్టర్‌లో స్కోరు సమం చేసిన చైనా.. మూడో క్వార్టర్‌లో 2-1తో ముందంజ వేసింది. నాల్గో క్వార్టర్‌లో రెండు గోల్స్ కొట్టిన చైనా.. 4-1తో తిరుగులేని ఆధిపత్యం చూపించింది. 52వ నిమిషంలో జాంగ్, 54వ నిమిషంలో చెన్ చైనాకు గోల్స్ కొట్టారు. చైనాకు ఏడు పెనాల్టీ కార్నర్‌లు లభించిగా ఓ సారి మాత్రమే గోల్‌గా మలిచింది. భారత్‌కు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు దక్కగా.. ఒక్క గోల్ సాధించింది. తొలి నిమిషంలోనే మూడు పెనాల్టీ కార్నర్‌లు సాధించిన భారత్.. నాల్గో పెనాల్టీని 40వ నిమిషంలో గెల్చుకుంది. కానీ గోల్‌గా మలచటంలో విఫలమైంది. ఆసియా కప్ విజేతగా నిలిచిన చైనా 2026 హాకీ వరల్డ్‌కప్‌కు నేరుగా అర్హత సాధించగా.. భారత్ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది.

# రాజారెడ్డి.. వర్సెస్ జగన్



**కడప - సూర్య వాస్తవం:** రాజకీయ పార్టీల్లో లెగసీ కంటిన్యూ చేయడానికి అన్నా చెల్లెళ్లు పోటీ పడుతున్నారు. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి రాజకీయ వారసత్వంపై కుటుంబాల్లోనే విభేదాలు తలెత్తాయి. అయితే తండ్రి నుంచి సంక్రమించిన రాజకీయాలకు వారసుడెవరు? అనేది నిర్ణయించేది నేతలు కాదు.. ఆ కుటుంబం కాదన్నది మర్చిపోతున్నారు. వారసుడు తామేనంటూ ప్రకటనలు చేస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ లోనూ కల్వకుంట్ల కవిత, కేటీఆర్ ల మధ్య విభేదాలు తలెత్తాయి. కేవలం రాజకీయ ఆధిపత్యం కోసమే ఈ కీచులాటలని చెప్పకతప్పదు. ఆంధ్రప్రదేశ్ లోనూ ఎప్పటి నుంచో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంపై యుద్ధమే జరుగుతుంది. వైఎస్ షర్మిల, వైఎస్ జగన్ ల మధ్య వార్ నడుస్తుంది. తాజాగా వైఎస్ రాజారెడ్డి వైఎస్ వారసుడంటూ షర్మిల చేసిన వ్యాఖ్యలతో మరోసారి రాజకీయ వారసత్వంపై రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుంది. సాధారణంగా తండ్రి మరణించిన వెంటనే రాజకీయ వారసత్వం కోసం కొందరు పోటీ పడతారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కూడా ఇందిరా గాంధీ మృతి తర్వాత రాజీవ్ గాంధీ, రాజీవ్ గాంధీ మరణం తర్వాత రాహుల్ గాంధీ వారసులుగా నిలిచారు. మేనకా గాంధీ వారసత్వంపై విభేదించారు. మేనకాగాంధీ తన వారసుడిగా వరుణ్ గాంధీని రంగంలోకి దించారు. అయితే చివరకు రాజకీయ వారసత్వం సోనియాగాంధీ ఇంటికి చేరుకుంది. మేనకా గాంధీ బీజేలో చేరిపోయారు. ఇక ప్రియాంక ఉన్నప్పటికీ ఆమె వారసత్వం జోలికి పోలేదు. అన్న రాహుల్ గాంధీ మాత్రమే వారసత్వం చేపట్టాలని చెబుతుంది. తమిళనాడులో కరుణానిధి మరణం తర్వాత స్టాలిన్, ఆళగిరి మధ్య వారసత్వ పోరు ప్రారంభమయినా పార్టీతో పాటు అధికారం కూడా స్టాలిన్ చేతుల్లోకి వచ్చింది. ఆళగిరి కనిపించడం లేదు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన తర్వాత వైఎస్ జగన్ సొంత పార్టీ పెట్టుకున్నారు. ఆయనను జనం ఆదించారు. 2019 ఎన్నికల్లో అధికారాన్ని కట్టబెట్టారు. అయితే ఇప్పుడు వైఎస్ వారసుడు వైఎస్ రాజారెడ్డి అంటూ తన కుమారుడిని రంగంలోకి దించారు. అయితే రాజారెడ్డి ఇంటిపేరు వైఎస్ కాదంటూ వైసీపీ సోషల్ మీడియాలో పెద్దయెత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. తన భర్త ఇంటి పేరు కుమారుడికే వస్తున్నా వైఎస్ ట్యాగ్ లైన్ వదలడానికి షర్మిల ఇష్టపడటం లేదు. తన కుమారుడికి రాజారెడ్డి అని వైఎస్ నామకరణం చేశారంటూ గుర్తు చేస్తున్నారు. అయితే రాజారెడ్డిని గుర్తించాల్సింది వైఎస్ కుటుంబ సభ్యులు కాదు.. షర్మిల అభిమానులు కాదు.. వైసీపీ వీరాభిమానులు కూడా కాదు. రాజారెడ్డి రాజకీయ ప్రవేశం చేసి వస్తే ఆయనను నేతగా గుర్తించాల్సింది ప్రజలు మాత్రమేనన్న విషయం మరిచిపోయి వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నంత కాలం కాంగ్రెస్ లోనే ఉన్నారు. పదవి ఉన్నా లేకున్నా ఆయన పార్టీని వీడలేదు. చివరకు రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. కానీ వైఎస్ జగన్ సొంత పార్టీ పెట్టుకున్న తర్వాత కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం వైసీపీకి షిఫ్ట్ అయింది. అంటే వైఎస్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఎక్కువ మంది వైఎస్ వారసుడిగా నాడు జగన్ ను గుర్తించారు. ఇప్పుడు కూడా రాజారెడ్డి రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ వారసుడిగా షర్మిల ప్రకటించుకుంటే చాలదు.

రేపు రాజారెడ్డి జనంలోకి వచ్చినప్పుడు ఆయనకు కనిపించే ఆదరణ, ఆయన సాధించే గెలుపులు వంటివి మాత్రమే వైఎస్ వారసుడు ఎవరన్నది తేల్చనున్నాయి. రాజారెడ్డి ఇంకా రాజకీయాల్లోకి రాకముందే ఆయన చుట్టూ వారసత్వంపై చర్చ జరుగుతుండటం విచిత్రమనే అనుకోవాలి. వైఎస్ షర్మిల కూడా తాను గత ఐదేళ్ల నుంచి సాధించింది రాజకీయాల్లో ఏమీ లేదని, రాజారెడ్డిని కూడా ఈ మురికి కూపంలోకి ఎందుకు తెస్తున్నారంటూ సోషల్ మీడియాలో వైఎస్ అభిమానులు కామెంట్ చేస్తున్నారు.

# కాన్ క్లేవ్ పేరుతో వైట్ కాలర్ దోపిడీ




**హైదరాబాద్ - సూర్య వాస్తవం:** రాజకీయ నాయకులు ప్రచారాన్ని కోరుకుంటారు. నిత్యం వార్తల్లో ఉండాలని అనుకుంటారు. తమ గురించి మాత్రమే మీడియా గొప్పగా చెప్పాలని.. తమకు నచ్చని వారిపై నిత్యం రాళ్లు వేస్తూ ఉండాలని.. బురద కుమ్మరిస్తూ ఉండాలని అనుకుంటారు. సహజంగా రాజకీయ నాయకులు కూడా మనుషులే కాబట్టి.. వారికి కూడా ఆశలు ఉంటాయి కాబట్టి తప్పులేదు. కానీ వారి మాదిరిగానే ప్రత్యర్థి నాయకులు కూడా అలానే ఆలోచిస్తారు కాబట్టి.. మీడియాకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. ఒకరి గురించి చెప్తే మరొకరు బాధపడతారని నిశ్శబ్దంగా ఉంటుంది. అయితే నేటి కాలంలో రాజకీయ నాయకులు ఆరి తేరి పోయారు కాబట్టి సొంతంగా మీడియా వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరైతే పరోక్షంగా మీడియా వ్యవస్థలను నడిపిస్తున్నారు.గతంలో పత్రికలను మాత్రమే నాయకులు మేనేజ్ చేసేవారు. కొంతకాలానికి న్యూస్ చానల్స్ వచ్చాయి. ఇప్పుడు సోషల్ మీడియా గ్రూపులు అదనంగా జత కూడిపోయాయి. ఆయనప్పటికీ రాజకీయ నాయకులకు ప్రచార యావ తగ్గడం లేదు. పైగా తమ మాటలను మాత్రమే ప్రజలు వినాలి అని కోరిక వారిలో అంతకంతకు పెరిగిపోతోంది. రాజకీయ నాయకుల ప్రచార పిచ్చిని కొన్ని మీడియా సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. అయితే చేసేది ఎలాగూ వైట్ కాలర్ దోపిడీ కాబట్టి మీడియా అధినేతలు దానికి సరికొత్త పేరు పెడుతున్నారు. విదేశాలలో ఎన్నికలు జరిగినప్పుడు పోటీలో ఉండే ఇద్దరు నాయకులను ఒకే వేదిక మీద తీసుకొస్తారు. అక్కడ ఉన్న పాత్రికేయులు రకరకాల ప్రశ్నలు అడుగుతారు. దానికి ఆ ఇద్దరు నాయకులు సమాధానాలు చెప్తారు. ఇందులో ఎటువంటి మీడియా స్వార్థం ఉండదు. పెయిడ్ భజన అంతకంటే ఉండదు. కాకపోతే ప్రజలకు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంటుంది. కానీ మన దేశంలో ఎన్నికలు లేకున్నా.. ఏదో జరిగిపోతోంది అనే భ్రమను కల్పించడంలో మీడియా ఆరి తేరిపోయింది. పైగా దానికి కాన్ క్లేవ్ అని పేరు పెట్టి.. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులను పిలుస్తోంది. పేరుకు భవిష్యత్తు కాలంలో దేశం పరిస్థితి ఏమిటి? రాష్ట్రాల పరిస్థితి ఏమిటి? అని చెబుతుంది. కానీ అంతర్గతంగా మాత్రం పెయిడ్ భజన. ఒక ముక్కలో చెప్పాలంటే అధికార పార్టీ దగ్గర కొంత.. ప్రతిపక్ష పార్టీ దగ్గర కొంత డబ్బులు తీసుకొని.. మీరు మంచివారే.. వారు కూడా మంచివారే.. వెరసి మనమంతా మంచివారమే అనే సందేశాన్ని ఓట్లు వేసిన ప్రజలకు ఇస్తుంది. ఎన్నో మీడియా సంస్థలు కాన్ క్లేవ్ లు నిర్వహించాయి. ఇంతవరకు అధికార పార్టీ చేసిన తప్పులను గాని.. ప్రతిపక్ష పార్టీ చేసిన అన్యాయాలను గాని వెలుగులోకి తీసుకురాలేకపోయాయి. న్యూట్రల్ గా ఉండాల్సిన మీడియా హౌస్ లోకి ఒక రాజకీయ నాయకుడు ప్రవేశించాడు అంటేనే దాని వెనుక ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. స్థూలంగా చెప్పాలంటే ఒకప్పుడు రాజకీయ నాయకుల నుంచి యాడ్స్ తీసుకునేవారు. ఆ తర్వాత పెయిడ్ ప్రమోషన్ మొదలుపెట్టారు. ఇప్పుడేమో కాన్ క్లేవ్ లు నిర్వహిస్తున్నారు. పేర్లు మాత్రమే తేడా.. చేసే వైట్ కాలర్ దోపిడీ మాత్రం ఒకటే.

# ఆలయాల సందర్శనకు రైలు రెడీ




**హైదరాబాద్ - సూర్య వాస్తవం:** దక్షిణాదిన పుణ్య క్షేత్రాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే దక్షిణాదిన ఉండే అనేక పుణ్య క్షేత్రాలకు నిత్యం దేశం నలుమూలల నుంచి ప్రజలు వచ్చి వెళుతుంటారు. అయితే దక్షిణ మధ్య రైల్వే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర పేరుతో ప్రత్యేక రైలును నడపనుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును నడపనుంది. ఈ నెల 23వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే గభారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు దక్షిణాదిన ఉన్న అనేక ఆలయాలను చుట్టివస్తుంది. ఈ ప్రత్యేక రైలు అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చిలోని రంగనాధస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలను దర్శించుకునే వీలుంది. సికింద్రాబాద్ నుంచి బయలుదేరి జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు ఢ రేణిగుంట వంటి ముఖ్యమైన స్టేషన్లలో మార్గ మధ్యంలో ఇరువైపులా ప్రయాణికుల కోసం రైలు ఎక్కేందుకు వీలుంది. ఈ యాత్ర మొత్తం ఏడు రాత్రులు, ఎనిమిది రోజుల వ్యవధిలో సాగుతుంది. ఇందులో అన్ని ప్రయాణ సౌకర్యాలు (రైలు మరియు రోడ్డు రవాణాతో సహా), వసతి సౌకర్యం, బోజన వసతిని కూడా కల్పిస్తారు. తిరువణ్ణామలై - అరుణాచలం ఆలయం రామేశ్వరం - రామనాథస్వామి ఆలయం మధురై - మీనాక్షి అమ్మన్ ఆలయం కన్యాకుమారి - రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం త్రివేంద్రం - శ్రీ పద్మనాభస్వామి ఆలయం తిరుచ్చి - శ్రీ రంగనాథస్వామి ఆలయం తంజావూరు - బృహదీశ్వర ఆలయం టూర్ ధర ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ లో పథ్నాలుగువేలు, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర 22,500 రూపాయలు, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర 29,500 రూపాయలుగా నిర్ణయించారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి ఈ రైలులో దక్షిణ భారతంలోని ఆలయాలను దర్శించుకునేందుకు టిక్కెట్లను బుక్ చేసుకోవాలంటే 9701360701, 9281030726, 9281030740, 9281495845 నంబర్లలో సంప్రదించవచ్చు.

# 16న కొనకొండ్ల గ్రామంలో జిల్లా జూనియర్ బాల బాలికల కబడ్డీ సెలక్షన్స్

**గుంటకల్ -సూర్యవాస్తవం, సెప్టెంబర్ 14:** గుంతకల్లు ఈ నెల 16న జిల్లా జూనియర్ బాల బాలికల కబడ్డీ సెలక్షన్స్ భారతి పబ్లిక్ స్కూల్ కొనకొండ్ల గ్రామం నందు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ సెలెక్ట్ అయిన వారు ఈ నెల 22, 23, 24, 25వ తేదీలలో విజయవాడలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరగబోయే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు. వివరాలకు 9441053041, 9966224669 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# డయోరియా మృతి అవాస్తవం

**విజయవాడ-సూర్య వాస్తవం:** మీడియాలో శుక్రవారం రాత్రి డయేరియాతో ఒక వ్యక్తి చనిపోయాడని వచ్చిన వార్తలన్నీ అవాస్తవం అని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ సుహాసిని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి న్యూ రాజరాజేశ్వరి పేట వద్ద ఏర్పాటుచేసిన డయేరియా మెడికల్ క్యాంపులో ఆమె మీడియాతో మాట్లాడారు. కుటుంబ కలహాల వలన మద్యం సేవించిన వ్యక్తి గుండె నొప్పితో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మరణించినట్లు వైద్యులు స్పష్టం చేశారని తెలిపారు.

# సాఫ్ట్ వేర్ కంపెనీలో అగ్ని ప్రమాదం భారీగా ఆస్తి నష్టం




**హైదరాబాద్-సూర్య వాస్తవం:** మాదాపూర్ లోని అయ్యప్ప సొసైటీలో ఉన్న ఓ సాఫ్ట్వేర్ కంపెనీలో శనివారం ఉదయం 4:30 గంటలకు మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం జరిగినప్పుడు కంపెనీలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే, ఆస్తి నష్టం భారీగా సంభవించింది. సమయానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం ఎంత జరిగిందో ఇంకా తెలియాల్సి ఉంది.

# గంగమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం



**తిరుపతి -సూర్యవాస్తవం, సెప్టెంబర్ 14:** తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం ఆదివారం ఉదయం సంప్రదాయబద్ధంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న పాలకమండలి సభ్యులు అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రమాణం చేశారు. దేవాదాయ శాఖ చట్టం 1987 ప్రకారం అధికారులు సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేశారు. 11 మంది సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులు పూజారి మురళీ స్వామి సహా ప్రతి ఒక్కరూ ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్ మహేష్ యాదవ్ నేతృత్వంలో మంచి ముహర్తం కావడంతో ఉదయం 8 గంటల నుంచి 8.20 గంటల మధ్య సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరైయ్యారు. అలాగే శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పులుగోరు మురళీ, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి తదితరలు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )